https://epaper.tharangalu.in

RNI. TELTEL / 2022 / 83463

జాతీయ దిన ప్రతిక

# తరంగాలు

Tharangalu Daily News Paper

ప్రతి అక్షరం.... సామాన్యుడి అస్త్రం...

హైదరాబాద్

సోమవారం, 16 ఫిబ్రవరి, 2026

సంపుటి: 116

సంచిక: 3

వెల: రూ. 5/-

Published From: Hyderabad, Circulated: Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Kurnool, Kadapa, Amaravathi, Krishna

## బీపీకి ఏడాదికి రెండు ఇంజెక్షన్లు చాలు!

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 15:**
రక్తపోటు (బీపీ) నియంత్రణకు ఇక రోజూ మాత్రలు వేసుకోవాల్సిన అవసరం ఉండకపోవచ్చు! ఏడాదికి రెండు ఇంజెక్షన్లు చేయించుకుంటే చాలు! ఇవి సమీప భవిష్యత్తులో అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. ఈ దిశగా శాస్త్రవేత్తల పరిశోధనలు సత్ఫలితాలు ఇస్తున్నాయని ప్రముఖ మెడికల్ జర్నల్ 'లాన్సెట్' ఓ వ్యాసం ప్రచురించింది. దాని ప్రకారం.. అమెరికాకు చెందిన రోష్ అండ్ అల్నైలమ్ ఫార్మాస్యూటికల్స్.. ఆర్ఎన్ఏ టెక్నాలజీతో జిలెబెసిరన్ అనే ఇంజెక్షన్‌ను అభివృద్ధి చేసింది. ప్రస్తుతం మూడో దశ ట్రయల్స్‌లో ఉంది.



2 లో

## తెలంగాణ భవన్‌లో ఘనంగా సంత్ సేవాలాల్ జయంతి

- బీఆర్ఎస్ కేంద్ర కార్యాలయంలో వేడుకలు
- పాల్గొన్న బంజారా నేతలు

**హైదరాబాద్, ఫిబ్రవరి 15 (తరంగాలు):**
గిరిజనుల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహారాజ్ 287వ జయంతి వేడుకలు బీఆర్ఎస్ కేంద్ర కార్యాలయం తెలంగాణ భవన్‌లో ఘనంగా నిర్వహించారు.



2 లో

## మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ అరాచకాలు

- తెలంగాణ భవన్‌లో ప్రెస్‌మీట్
- పారదర్శకంగా మేయర్, చైర్మన్ ఎన్నికలు జరపాలని డిమాండ్

# 20 ఎకరాల్లో సంత్ సేవాలాల్ మహారాజ్ పుణ్యక్షేత్రం







- బంజారాల ఆరాధ్యదైవానికి నల్లమలలో ప్రపంచ స్థాయి నిర్మాణానికి సీఎం ప్రకటన
- గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా అత్యద్భుతంగా క్షేత్రాన్ని అభివృద్ధి చేస్తాం
- తండాలకు రోడ్లు, పాఠశాలలు, మౌలిక వసతులపై దృష్టి
- సేవాలాల్ జయంతి ఉత్సవాలు అక్కడే నిర్వహణ
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, ఫిబ్రవరి 15 (తరంగాలు ప్రతినిధి):**
బంజారాల ఆరాధ్యదైవం సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ పుణ్యక్షేత్రాన్ని నల్లమల అటవీ ప్రాంతంలో నిర్మిస్తామని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రకటించారు. వచ్చే ఏడాది సేవాలాల్ జయంతి ఉత్సవాలను అక్కడే నిర్వహించేలా, గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా అత్యద్భుతంగా క్షేత్రాన్ని అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఇప్పటికే 20 ఎకరాల భూమిని కేటాయించినట్లు వెల్లడించారు. ఆదివాసీలకు ఆదిలాబాద్‌లో నాగోబా దేవాలయం, మేడారంలో సమ్మక్క--సారలమ్మ పుణ్యక్షేత్రం ఉన్నట్టుగా బంజారాలకు ప్రత్యేక క్షేత్రం లేదని సీఎం పేర్కొన్నారు. అందువల్ల ప్రపంచంలోనే విశిష్టమైన పుణ్యక్షేత్రంగా, గొప్ప పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశించారు. గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సేవాలాల్ మహారాజ్ జయంతి కార్యక్రమంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎంపీ పోరిక బలరాం నాయక్ తదితరులు పాల్గొన్నారు. తెలంగాణలోని అన్ని తండాలు, గూడాలకు తప్పనిసరిగా బీటీ రోడ్లు ఉండాలని, ప్రతి గ్రామపంచాయతీలో పాఠశాల, పంచాయతీ భవనం నిర్మించాలని సీఎం సూచించారు. తాగునీరు, విద్యుత్ సరఫరా కల్పించడంతో పాటు అటవీ ప్రాంతాల్లో సోలార్ పంపుసెట్లను ఏర్పాటు చేయాలని అధికారులను దిశానిర్దేశం చేశారు. గిరిజనుల అభివృద్ధి కోసం సమగ్ర చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. సేవాలాల్ మహారాజ్ మానవజాతిని శాంతి, సన్మార్గంలో నడవాలని బోధించిన మహనీయుడని సీఎం పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర నిర్మాణంలో లంబాడా సోదరుల పాత్రను స్మరించుకుంటూ వారికి సంక్షేమం, అభివృద్ధి, గౌరవం అందించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సీఎం సేవాలాల్ మహారాజ్ విగ్రహానికి పుష్పాంజలి ఘటించి, బంజారాలు ప్రదర్శించిన ఉత్పత్తులను పరిశీలించారు.

## 1008 నదుల జలాలతో జలలింగాభిషేకం

- మహాశివరాత్రి సందర్భంగా ఫసల్‌వాడిలో వైభవం
- మంత్రి దామోదర్ రాజనర్సింహా స్వయంగా ప్రదక్షిణలు
- వేలాది భక్తుల సమక్షంలో ప్రత్యేక పూజలు



2 లో

## మేఘా అనుబంధ సంస్థ ఈవీ ట్రాన్స్‌లో చేరిన లక్ష్మీనారాయణ

- వైస్ ప్రెసిడెంట్ – ఆపరేషన్స్‌గా నూతన బాధ్యతలు
- సీబీఐ జేడీగా జగన్ కేసులను దర్యాప్తు చేసిన అధికారి
- జనసేనలో చేరి, ఆపై సొంత పార్టీ స్థాపించిన లక్ష్మీనారాయణ


**హైదరాబాద్, తరంగాలు:**
సీబీఐ మాజీ జేడీ, రిటైర్డ్ ఐపీఎస్ అధికారి వీవీ లక్ష్మీనారాయణ తన కెరీర్‌లో కొత్త అధ్యాయాన్ని ప్రారంభించారు. ఆయన ప్రముఖ మౌలిక సదుపాయాల సంస్థ మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ **(MEIL)**కు చెందిన అనుబంధ సంస్థ ఈవీ ట్రాన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లో వైస్ ప్రెసిడెంట్ -- ఆపరేషన్స్‌గా బాధ్యతలు చేపట్టారు. ఈ నియామకాన్ని సంస్థ లింక్డ్ఇన్ ద్వారా అధికారికంగా ప్రకటించింది.

2లో



# శివ నామస్మరణతో హోరెత్తుతున్న శైవ క్షేత్రాలు

- భక్తులతో కిటకిటలాడుతున్న శివాలయాలు
- తెల్లవారుజాము నుంచే ప్రత్యేక పూజలు



## జనసేన క్రియాశీలక సభ్యత్వ నమోదు ప్రారంభం

- మంగళగిరిలో పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆరంభం
- రూ.2 కోట్లు విరాళం ఇచ్చి తొలి సభ్యత్వం తీసుకున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్
- "ఉద్యమి", "సాధక్", "ప్రదాత" పేర్లతో కొత్త వర్గీకరణ





2 లో

## బంజారా సమాజ ఐక్యత, సంస్కృతి పరిరక్షణకు తెలంగాణ జాగృతి కట్టుబడి ఉంది

2 లో



- జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత
- ఘనంగా సంత్ సేవాలాల్ జయంతి వేడుకలు
- తెలంగాణ జాగృతి కార్యాలయంలో ప్రత్యేక పూజలు
- భోగ్ బండార్ నిర్వహణ

## మున్సిపల్ ఎన్నికల్లో
# కాంగ్రెస్ అరాచకాలు

- ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్




**హైదరాబాద్, ఫిబ్రవరి 15 (తరంగాలు ప్రతినిధి):** తెలంగాణ భవన్‌లో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో భారత రాష్ట్ర సమితి ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మున్సిపల్ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ అరాచకాలకు పాల్పడుతోందని ఆరోపించారు. బీఆర్ఎస్ పార్టీకి ఓట్లు వేసిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. మున్సిపల్ ఎన్నికల్లో తమ పార్టీకి ముప్పై శాతానికి పైగా ఓట్లు వచ్చాయని పేర్కొన్నారు. 2020లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి నాలుగు మున్సిపాలిటీలు మాత్రమే వచ్చాయని గుర్తుచేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక శాఖలను తన వద్ద ఉంచుకుని ప్రజాస్వామ్యాన్ని పరిహాసం చేస్తున్నారని విమర్శించారు. మున్సిపల్, హోం, విద్యా శాఖలను తన వద్ద ఉంచుకోవడంతో అధికార దుర్వినియోగం జరుగుతోందని ఆరోపించారు. మున్సిపల్ శాఖ ముఖ్యమంత్రి వద్ద ఉండటంతో ఆస్తి వ్యాపారం పూర్తిగా పడిపోయిందని వ్యాఖ్యానించారు. మున్సిపల్ ఎన్నికలను వారం రోజుల్లోనే ముగించారని, అభ్యర్థులను ఎంపిక చేసుకునే సమయం కూడా ఇవ్వలేదన్నారు. నామినేషన్లు వేయడానికి వచ్చిన అభ్యర్థులను బయటపెట్టిన ఘటనలు జరిగాయని ఆరోపించారు. వికారాబాద్ సభలో హస్తం గుర్తుకు ఓటు వేయాలని ముఖ్యమంత్రి చెప్పినా ఎన్నికల సంఘం నోటీసులు ఇవ్వలేదని అన్నారు. మోడల్ నియమావళిని ఎవరైనా ఉల్లంఘిస్తే ఎన్నికల సంఘం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సంగారెడ్డిలో జగ్గారెడ్డి, నిజామాబాద్‌లో ధర్మపురి అరవింద్ పోలీసులను దూషించారని, జగ్గారెడ్డి రౌడీషీటర్లతో వచ్చి హోంగార్డులను అవమానించారని పేర్కొన్నారు. శివకుమార్ యాదవ్ అనే సీఐకి ప్రెసిడెన్షియల్ అవార్డు వచ్చిన విషయాన్ని గుర్తుచేస్తూ, అధికారులపై దాడులు సహించబోమన్నారు. బీఆర్ఎస్‌కు 788 వార్డులు వచ్చాయని, తమ పార్టీకి 15 శాతం ఓట్లు వచ్చాయని ప్రచారం చేయడం తప్పుడు సమాచారమని ఆరోపించారు. కొన్ని పత్రికలు ముఖ్యమంత్రి ఆశయాలకు అనుగుణంగా విషం చిమ్ముతున్నాయని వ్యాఖ్యానించారు. 2020లో బీఆర్ఎస్ 110 మున్సిపాలిటీలు గెలిచిందని, ప్రస్తుతం 36 మున్సిపాలిటీలు హంగ్‌లో ఉన్నాయని తెలిపారు. హంగ్ మున్సిపాలిటీలను ఏమైనా చేసి కాంగ్రెస్ గెలవాలని ఆదేశాలు ఇచ్చారని ఆరోపించారు. చైర్మన్, మేయర్ ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించాలని, ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ కోరారు.

## బంజారా సమాజ ఐక్యత, సంస్కృతి
# పరిరక్షణకు తెలంగాణ జాగృతి కట్టుబడి ఉంది




**హైదరాబాద్, ఫిబ్రవరి 15 (తరంగాలు ప్రతినిధి):** బంజారా సమాజ ఐక్యత, సంస్కృతి పరిరక్షణకు తెలంగాణ జాగృతి కట్టుబడి ఉందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తెలిపారు. బంజారాల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ 287వ జయంతి సందర్భంగా తెలంగాణ జాగృతి కార్యాలయంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పాల్గొని సేవాలాల్ విగ్రహానికి పూలమాలలు అర్పించారు. బంజారా సంప్రదాయాల మధ్య ఆధ్యాత్మిక వాతావరణంలో కార్యక్రమం కొనసాగింది. ఈ సందర్భంగా భోగ్ బండార్ నిర్వహించి, సేవాలాల్ విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. బంజారా పూజారులు వేదమంత్రోచ్చారణల మధ్య ప్రార్థనలు నిర్వహించి సమాజ శ్రేయస్సు కోరారు. సేవ, సత్యం, సమానత్వం అనే విలువలను సేవాలాల్ బోధించారని



పలువురు నాయకులు గుర్తుచేశారు. కార్యక్రమంలో తెలంగాణ జాగృతి కార్యనిర్వాహక అధ్యక్షుడు ఎల్ రూప్ సింగ్, పలువురు బంజారా పూజారులు, జాగృతి బంజారా నాయకులు పాల్గొన్నారు. సంత్ సేవాలాల్ ఆశయాల మార్గంలో సమాజ అభివృద్ధి కొనసాగాలని, యువత ఆయన బోధనలను అనుసరించాలని నాయకులు పిలుపునిచ్చారు. జయంతి వేడుకలు భక్తి శ్రద్ధలతో ముగిశాయి.

## తెలంగాణ భవన్‌లో ఘనంగా
# సంత్ సేవాలాల్ జయంతి

బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కల్వకుంట్ల తారక రామారావు ముఖ్య అతిథిగా హాజరై సేవాలాల్ చిత్రపటానికి పూలమాలలు అర్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ బంజారా నేతలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. బంజారా మహిళల సాంప్రదాయ నృత్యాలు, డప్పు చప్పుళ్లతో తెలంగాణ భవన్ సందడి చేసింది. బంజారా పూజారులు నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమం భోగ్ బండార్‌లో నేతలు పాల్గొని సమాజ శ్రేయస్సు కోసం ప్రార్థనలు చేశారు. మాజీ మంత్రులు సత్యవతి, వి శ్రీనివాస్ గౌడ్, ఎమ్మెల్యే అనిల్ జాధవ్, ఖానాపూర్ నియోజకవర్గ ఇంచార్జి జాన్సన్ తదితరులు హాజరయ్యారు. పలువురు మాజీ సంస్థల చైర్మన్లు, పార్టీ కార్యకర్తలు కూడా వేడుకల్లో పాల్గొని



సేవాలాల్ ఆశయాలను స్మరించారు. సేవ, సత్యం, సమానత్వం అనే విలువలను సేవాలాల్ బోధించారని నేతలు పేర్కొన్నారు. సంత్ సేవాలాల్ మార్గదర్శకత్వంలో బంజారా సమాజ అభివృద్ధి కొనసాగాలని, ఐక్యతతో ముందుకు సాగాలని నేతలు పిలుపునిచ్చారు. జయంతి వేడుకలు భక్తి శ్రద్ధలతో ముగిశాయి.

## మేఘా అనుబంధ సంస్థ ఈవీ ట్రాన్స్‌లో చేరిన లక్ష్మీనారాయణ

1990 మహారాష్ట్ర క్యాడర్ ఐపీఎస్ అధికారి అయిన లక్ష్మీనారాయణ, సీబీఐ జాయింట్ డైరెక్టర్‌గా పనిచేసిన సమయంలో జగన్ అక్రమాస్తుల కేసుతో పాటు పలు కీలక కేసుల దర్యాప్తులో కీలకంగా వ్యవహరించి తెలుగు రాష్ట్రాల్లో సుపరిచితులయ్యారు. ముంబైలో అడిషనల్ డీజీగా పదవీ విరమణ చేసిన అనంతరం ఆయన రాజకీయాల్లోకి ప్రవేశించారు. 2019 ఎన్నికల్లో జనసేన పార్టీ తరఫున విశాఖపట్నం ఎంపీగా పోటీ చేసి ఓటమి పాలయ్యారు. తర్వాత 'జై భారత్ నేషనల్ పార్టీ' పేరుతో సొంత పార్టీని కూడా స్థాపించారు. కొంతకాలం పాటు వ్యవసాయం కూడా చేశారు. హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న ఈవీ ట్రాన్స్, దేశంలోని ప్రముఖ ఎలక్ట్రిక్ బస్ ఆపరేటర్లలో ఒకటి. తెలంగాణ ఆర్టీసీతో పాటు ముంబై, పుణే వంటి నగరాల్లో దాదాపు 900కు పైగా ఎలక్ట్రిక్ బస్సులను ఈ సంస్థ నడుపుతోంది. లక్ష్మీనారాయణకు ఐపీఎస్‌కు ముందే ఇంజినీరింగ్ నేపథ్యం ఉంది. ఎన్ఐటీ వరంగల్, ఐఐటీ మద్రాస్‌లో ఉన్నత విద్యను అభ్యసించారు. ఆయనకున్న ఇంజినీరింగ్ పరిజ్ఞానం, పరిపాలన అనుభవం తమ సంస్థ అభివృద్ధికి దోహదపడతాయని ఈవీ ట్రాన్స్ యాజమాన్యం విశ్వాసం వ్యక్తం చేసింది. సుదీర్ఘ ప్రభుత్వ సేవ, రాజకీయ ప్రయోగాల తర్వాత ఆయన కార్పొరేట్ రంగంలోకి అడుగుపెట్టడం ప్రాధాన్యత సంతరించుకుంది.

## తెలుగు రాష్ట్రాల్లో శివ నామస్మరణతో హోరెత్తుతున్న శైవ క్షేత్రాలు

మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా తెలుగు రాష్ట్రాల్లోని శైవక్షేత్రాలు 'ఓం నమః శివాయ' నామస్మరణతో మార్మోగుతున్నాయి. ఆదివారం (ఫిబ్రవరి 15) తెల్లవారుజాము నుంచే ఆలయాలకు భక్తులు పోటెత్తడంతో ఆధ్యాత్మిక వాతావరణం వెల్లివిరుస్తోంది. ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలైన శ్రీశైలం, వేములవాడ, కాళేశ్వరం, కోటిపల్లి సహా అన్ని శివాలయాలు భక్తులతో కిటకిటలాడుతున్నాయి. పవిత్ర నదుల్లో స్నానాలు ఆచరించిన భక్తులు, శివనామ స్మరణ చేస్తూ స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిస్తున్నారు. తెలంగాణలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో భక్తుల సందడి నెలకొంది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తో పాటు మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ నుంచి కూడా భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి, స్వామివారి దర్శనం కోసం గంటల తరబడి క్యూలైన్లలో బారులు తీరారు. అలాగే, కాళేశ్వరంలోని ముక్తేశ్వర స్వామి ఆలయం, శ్రీశైలంలోని భ్రమరాంబికా మల్లికార్జున స్వామి ఆలయం, కీసర, వరంగల్‌లోని చారిత్రక శివాలయాలు భక్తజన సంద్రంగా మారాయి. 'హర హర మహాదేవ', 'శంభో శంకర' అంటూ భక్తులు చేస్తున్న జయజయధ్వానాలతో ఆలయ ప్రాంగణాలు దద్దరిల్లుతున్నాయి. మహాశివరాత్రి సందర్భంగా ఆలయాల్లో రుద్రాభిషేకాలు, బిల్వార్చనలు, మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు వైభవంగా జరుగుతున్నాయి. రాత్రివేళ శివపార్వతుల కల్యాణ మహోత్సవాలు, జాగరణ కోసం ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని తెలంగాణ ఆర్టీసీ (టీజీఎస్ఆర్టీసీ) పలు శైవ క్షేత్రాలకు ప్రత్యేక బస్సు సర్వీసులను నడుపుతోంది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్ట భద్రతా చర్యలు చేపట్టారు. భక్తులకు తాగునీరు, మజ్జిగ వంటి సౌకర్యాలను కల్పించారు. శివపార్వతులు ఏకమైన ఈ పవిత్రమైన రోజున ఉపవాసం ఉండి, రాత్రంతా జాగరణ చేస్తే సకల పాపాలు తొలగి పుణ్యఫలం దక్కుతుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం.

# యువతలో రాజకీయ అవగాహన పెరుగుతోందా? తగ్గుతోందా?

- సమాచార యుగంలో చైతన్యం ఉపరితలమా? లోతుందా?
- సామాజిక మాధ్యమాల ప్రభావం దిశానిర్దేశమా? దారితప్పుదామా?
- ఓటు హక్కు వినియోగం సంఖ్యల పెరుగుదల సరిపోతుందా?
- ప్రజాస్వామ్య భవిష్యత్తు యువత బాధ్యత ఎంత?

**డెస్క్, ఫిబ్రవరి 15 (తరంగాలు ప్రతినిధి):** భారతదేశం యువత దేశంగా పిలవబడుతోంది. జనాభాలో అధిక శాతం యువతే ఉండటం ప్రజాస్వామ్యానికి ఒక గొప్ప అవకాశంగా భావించబడుతోంది. అలాంటి నేపథ్యంలో యువతలో రాజకీయ అవగాహన స్థాయి ఎలా ఉందన్నది అత్యంత ప్రాధాన్యమైన ప్రశ్న. ఒకవైపు సమాచార విప్లవం యువతకు అపారమైన సమాచారం అందుబాటులోకి తెచ్చింది. మరోవైపు అదే సమాచారం గందరగోళానికి, భావోద్వేగ రాజకీయాలకు దారితీస్తోందన్న విమర్శలు ఉన్నాయి. ఈ రెండు విభిన్న వాస్తవాల మధ్య యువత రాజకీయ అవగాహన నిజంగా పెరుగుతోందా? లేక ఉపరితల స్థాయిలోనే పరిమితమవుతోందా అన్న సందేహం ముందుకు వస్తోంది. సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి యువతను రాజకీయ చర్చలకు దగ్గర చేసింది. ఎన్నికల సమయంలో సోషల్ వేదికలు చురుకుగా మారుతున్నాయి. విధానాలపై చర్చలు, విమర్శలు, సమీక్షలు జరుగుతున్నాయి. ప్రజా సమస్యలపై యువత స్పందిస్తోంది. పర్యావరణం, ఉపాధి, విద్య, ధరల పెరుగుదల వంటి అంశాలపై యువత ఉద్యమాలు కూడా కనిపిస్తున్నాయి. ఇది రాజకీయ చైతన్యం పెరుగుతోందన్న సంకేతం. అయితే మరో కోణంలో చూస్తే, సమాచార మోత అధికమవడం వల్ల వాస్తవాన్ని విశ్లేషించే లోతు తగ్గుతోందన్న వాదనలు ఉన్నాయి. తక్షణ స్పందనలే ఎక్కువగా కనిపిస్తున్నాయి. అంశాలపై పూర్తిస్థాయి అవగాహన లేకుండా అభిప్రాయాలు వ్యక్తపరచడం పెరిగింది. సామాజిక మాధ్యమాల్లో ప్రచారం, అసత్య సమాచారం, భావోద్వేగ పోస్టులు యువతను ప్రభావితం చేసే అవకాశముంది. విమర్శనాత్మక ఆలోచన కంటే వెంటనే స్పందించడం ప్రధాన ధోరణిగా మారుతోంది. ఓటు హక్కు వినియోగంలో యువత భాగస్వామ్యం గణనీయంగా పెరుగుతోందని గణాంకాలు సూచిస్తున్నాయి. ఇది ప్రజాస్వామ్యానికి మంచి సూచిక. కానీ ఓటు వేయడం ఒక్కటే రాజకీయ అవగాహనకు ప్రమాణం కాదు. విధానాలను అర్థం చేసుకోవడం, రాజ్యాంగ విలువలను గౌరవించడం, ప్రజా సమస్యల పరిష్కారంలో భాగస్వామ్యం కావడం కూడా సమానంగా ముఖ్యం. యువత రాజకీయాలను కేవలం విమర్శల వేదికగా కాకుండా బాధ్యతగా చూడాల్సిన అవసరం ఉంది. విద్యాసంస్థల్లో పౌర శాస్త్రంపై మరింత దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. రాజ్యాంగం, హక్కులు, బాధ్యతలు, ప్రజాస్వామ్య వ్యవస్థపై లోతైన అవగాహన పెంపొందించాలి. రాజకీయాల్లో పాల్గొనడం అంటే పార్టీ రాజకీయాల్లో చేరడమే కాదు. సమాజ సేవ, అవగాహన కార్యక్రమాలు, విధానాలపై చర్చలుఇవీ కూడా రాజకీయ చైతన్య రూపాలే. యువత ఈ దిశగా అడుగులు వేయాలి. ప్రస్తుతం యువతలో ఒక విరుద్ధ ధోరణి కనిపిస్తోంది. ఒకవైపు రాజకీయాలపై ఆసక్తి పెరుగుతోంది. మరోవైపు రాజకీయాలను పూర్తిగా దూరం పెట్టాలనే భావన కూడా ఉంది. అవినీతి, నెగెటివ్ ప్రచారం, వ్యక్తిగత దూషణలు యువతలో విసుగును కలిగిస్తున్నాయి. ఈ పరిస్థితి మారాలంటే రాజకీయ వ్యవస్థలో పారదర్శకత, విలువలు పెరగాలి. యువతకు ఆదర్శంగా నిలిచే నాయకత్వం అవసరం. భవిష్యత్ ప్రజాస్వామ్యం యువత చేతుల్లోనే ఉంది. అవగాహనతో కూడిన యువత సమాజాన్ని సానుకూల దిశగా నడిపించగలదు. భావోద్వేగాలకు లోనవకుండా వాస్తవాలను విశ్లేషించే సామర్థ్యం పెరగాలి. విభజనకంటే ఐక్యతను, ద్వేషకంటే చర్చను, అంధ అనుసరణకంటే విమర్శనాత్మక ఆలోచనను ప్రోత్సహించాలి. మొత్తంగా యువతలో రాజకీయ అవగాహన పూర్తిగా తగ్గిపోలేదు. అలాగే పూర్తిగా పరిపక్వమైందని కూడా చెప్పలేం. సమాచారం పెరిగింది, స్పందన పెరిగింది. కానీ లోతు, విశ్లేషణ, బాధ్యతతో కూడిన పాల్గొనడం పెరగాలి. ప్రజాస్వామ్య బలం యువత చైతన్యంపై ఆధారపడి ఉంటుంది. అవగాహనతో, విలువలతో, బాధ్యతతో ముందుకు సాగే యువతే దేశ భవిష్యత్తును బలపరుస్తుంది.

## వాణిజ్య ఒప్పందాలపై కాంగ్రెస్
# ఆరోపణలు అసత్యం: అమిత్ షా

- రైతుల ప్రయోజనాలకు పూర్తి రక్షణ కల్పించామని స్పష్టం
- గాంధీనగర్‌లో ప్రజా పంపిణీ వ్యవస్థ ప్రారంభం



**గాంధీనగర్, ఫిబ్రవరి 15, తరంగాలు:** అమెరికా, యూరోపియన్ యూనియన్‌లతో భారత్ కుదుర్చుకున్న వాణిజ్య ఒప్పందాల వల్ల దేశంలోని రైతులకు నష్టం వాటిల్లుతుందంటూ కాంగ్రెస్ చేస్తున్న ఆరోపణలను కేంద్ర హోంమంత్రి అమిత్ షా తీవ్రంగా ఖండించారు. రైతుల విషయంలో కాంగ్రెస్, ఆ పార్టీ నేత రాహుల్ గాంధీ అబద్ధాలు ప్రచారం చేస్తూ దేశాన్ని తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. ప్రతి ఒప్పందంలోనూ వ్యవసాయం, పాడి, మత్స్య రంగాల ప్రయోజనాలకు ప్రభుత్వం పూర్తి రక్షణ కల్పించిందని స్పష్టం చేశారు. గాంధీనగర్‌లో దేశంలోనే తొలి సెంట్రల్ బ్యాంక్ డిజిటల్ కరెన్సీ ఆధారిత ప్రజా పంపిణీ వ్యవస్థను ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. పార్లమెంటులో నిలబడి రైతుల ప్రయోజనాలను కాపాడతామని రాహుల్ గాంధీ మాట్లాడటం నవ్వొస్తోందని ఎద్దేవా చేశారు. దేశ ప్రజలను తప్పుదోవ పట్టించడంలో కాంగ్రెస్‌కు సుదీర్ఘ చరిత్ర ఉందని, ఇప్పుడు వాణిజ్య ఒప్పందాల విషయంలో కూడా అసత్య ప్రచారం చేస్తోందని ఆరోపించారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో జరిగిన ప్రతి చర్చలోనూ రైతులు, పశుపోషకులు, మత్స్యకారుల ప్రయోజనాలకు ఎలాంటి హాని కలగకుండా చర్యలు తీసుకున్నామని హామీ ఇచ్చారు. గత యూపీఏ ప్రభుత్వంతో పోల్చుతూ తమ ప్రభుత్వం వ్యవసాయ రంగానికి చేసిన కృషిని వివరించారు. మన్మోహన్ సింగ్ హయాంలో వ్యవసాయ బడ్జెట్ రూ. 26,000 కోట్లుగా ఉండగా, ప్రస్తుతం అది రూ. 1,29,000 కోట్లకు పెరిగిందని పేర్కొన్నారు. గత దశాబ్దంలో కనీస మద్దతు ధరకు ఆహార ధాన్యాల సేకరణ పదిహేను రెట్లు పెరిగిందని తెలిపారు. రైతులు అప్పులపాలు కాకుండా ఉండేందుకు ప్రతి ఏడాది రూ. 6,000 నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నామని గుర్తుచేశారు. స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల వల్ల దేశీయ పాడి రంగం దెబ్బతింటుందన్న విమర్శలను కూడా ఆయన తిప్పికొట్టారు. ప్రభుత్వం పాడి ఉత్పత్తి రంగాన్ని బలోపేతం చేసిందని, అన్ని ఒప్పందాల్లోనూ పాడి రంగానికి పూర్తి రక్షణ కల్పించామని పేర్కొన్నారు. ఈ అంశంపై ఎప్పుడైనా బహిరంగ చర్చకు రావాలని రాహుల్ గాంధీకి సవాల్ విసిరారు. ఇటీవల భారత్–యూరోపియన్ యూనియన్ మధ్య స్వేచ్ఛా వాణిజ్య చర్చలు ముగియడం, అమెరికాతో వాణిజ్య ఒప్పందం కుదరడం వంటి పరిణామాల నేపథ్యంలో అమిత్ షా వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

## 1008 నదుల జలాలతో జలలింగాభిషేకం



**సంగారెడ్డి, ఫిబ్రవరి 15 (తరంగాలు ప్రతినిధి):** మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని రాష్ట్ర వైద్య, ఆరోగ్య, సంక్షేమ శాఖల మంత్రి దామోదర్ రాజనర్సింహ సంగారెడ్డి జిల్లా ఫసల్‌వాడి గ్రామంలోని శ్రీ జ్యోతిర్ వాస్తు విద్యాపీఠం ఆధ్వర్యంలో నిర్వహించిన జలలింగాభిషేక కార్యక్రమంలో పాల్గొన్నారు. దేశంలోని 1008 నదుల నుంచి సేకరించిన తీర్థజలాలతో ఈ విశిష్ట అభిషేకాన్ని ఘనంగా నిర్వహించారు. బ్రహ్మశ్రీ డాక్టర్ మహేశ్వర శర్మ సిద్ధాంతి ఆధ్వర్యంలో చేపట్టిన గరక పూజలో భాగంగా మంత్రి స్వయంగా నదీజలాలతో నిండిన బిందెను తలపై మోసుకుని ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి జలలింగానికి అభిషేకం చేశారు. వేద మంత్రోచ్ఛరణల నడుమ కార్యక్రమం ఆధ్యాత్మిక వాతావరణంలో కొనసాగింది. అనంతరం జలలింగం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు పొందారు. రాష్ట్ర ప్రజలందరికీ శాంతి, సుభిక్షం కలగాలని ప్రార్థించారు. మహాశివరాత్రి సందర్భంగా భక్తి భావంతో పూజలు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వేలాది మంది శివభక్తులు పాల్గొన్నారు. నిర్వాహకులు భక్తులకు తగిన ఏర్పాట్లు చేసి కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు.

## జనసేన క్రియాశీలక సభ్యత్వ నమోదు ప్రారంభం

**మంగళగిరి, ఫిబ్రవరి 15 (తరంగాలు ప్రతినిధి):** జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆదివారం ఉదయం ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ప్రారంభించారు. పార్టీ బలోపేతం, సిద్ధాంతాల విస్తరణ లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. సభ్యత్వ నమోదుకు రూ.2 కోట్లు విరాళంగా అందించి, తొలి సభ్యత్వాన్ని స్వయంగా తీసుకున్నారు. పార్టీ భావజాలాన్ని లోతుగా అర్థం చేసుకొని సిద్ధాంతాలకు అనుగుణంగా పనిచేసే వారిని "ఉద్యమి"గా పిలుస్తామని ప్రకటించారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లి కొత్త సభ్యులను చేర్చేవారిని "సాధక్"గా పేర్కొంటామని తెలిపారు. జనసేన పార్టీ చేస్తున్న ప్రజా, రాజకీయ పోరాటాలకు పరోక్షంగా సమయం, ఆర్థిక, సాంకేతిక, సేవా, మేథా సహాయ సహకారాలు అందించే వారిని "ప్రదాత"గా ఇకపై సంబోధిస్తామని తెలిపారు. ఈ వర్గీకరణ ద్వారా పార్టీకి బలమైన నిర్మాణాత్మక శక్తి అందుతుందని అభిప్రాయపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహించి, యువతను, వివిధ సామాజిక వర్గాలను ఆకర్షించేందుకు ప్రత్యేక ప్రణాళికలు అమలు చేయనున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి.

# ఆంధ్రప్రదేశ్‌లో సోమవారం బిల్ గేట్స్ పర్యటన

- ముఖ్యమంత్రి, మంత్రులతో కీలక భేటీలు
- విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల్లో భాగస్వామ్యంపై చర్చ

**అమరావతి, ఫిబ్రవరి 15 (తరంగాలుప్రతినిధి):** మైక్రోసాఫ్ట్ వ్యవస్థాపక అధినేత బిల్ గేట్స్ సోమవారం ఆంధ్రప్రదేశ్‌లో పర్యటించనున్నారు. రాష్ట్ర ప్రభుత్వంతో కీలక రంగాల్లో భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడానికి ఆయన తన బృందంతో కలిసి ఏపీకి రానున్నారు. ఈ పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, సమాచార సాంకేతిక శాఖ మంత్రి నారా లోకేశ్‌లతో సమావేశమవుతారు. సోమవారం ఉదయం 10 గంటలకు బిల్ గేట్స్ సచివాలయానికి చేరుకుని ముందుగా రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ కేంద్రాన్ని సందర్శించనున్నారు. పాలనలో సాంకేతికత వినియోగాన్ని పరిశీలించిన అనంతరం ముఖ్యమంత్రి, ఇతర మంత్రులు, ఉన్నతాధికారులతో సమావేశమవుతారు. విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల్లో గేట్స్ ఫౌండేషన్ సహకారంతో అమలవుతున్న ప్రాజెక్టులను విస్తరించే అంశంపై ప్రధానంగా చర్చించనున్నారు. 'స్వర్ణాంధ్ర విజన్–2047' లక్ష్యాల సాధనకు ప్రభుత్వం చేపట్టిన సంస్కరణలు, ప్రజారోగ్యం, వ్యవసాయం, విద్య, వైద్య సాంకేతిక రంగాల్లో జరుగుతున్న పురోగతిపై ముఖ్యమంత్రి ప్రజెంటేషన్ ఇవ్వనున్నారు. ముఖ్యంగా గేట్స్ ఫౌండేషన్ సహకారంతో అమలవుతున్న 'సంజీవని' ప్రాజెక్టు పనితీరును వివరించనున్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా డిజిటల్ ఆరోగ్య రికార్డులను రూపొందించి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యంగా ఉంది. సమావేశాల అనంతరం బిల్ గేట్స్ బృందం అమరావతిలోని ఉండవల్లి సమీపంలో ఉన్న వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించనుంది. అక్కడ డ్రోన్లు, కృత్రిమ మేధస్సు ఆధారిత ఆధునిక వ్యవసాయ పద్ధతులను పరిశీలించనున్నారు. రాష్ట్రంలో సాంకేతిక



ఆధారిత అభివృద్ధి దిశగా ఈ పర్యటనకు ప్రాధాన్యం ఏర్పడింది.

# 'నా చీరలు, మందు తిరిగిచ్చేయండి'

**– ఇంటింటికి తిరిగి వసూలు చేస్తున్న ఓడిన అభ్యర్థి**

తెలంగాణలో మున్సిపల్ ఎన్నికలు ముగిశాయి. ఈనెల 11న పోలింగ్ జరగ్గా..13న ఫలితాలు వెల్లడయ్యాయి. ఇక ఛైర్మన్లు, మేయర్ల ఎన్నిక ఒక్కటే బాకీ ఉండగా.. ఈనెల 16న అవి కూడా జరగనున్నాయి. ఇదిలా ఉండగా.. గెలిచిన అభ్యర్థులు సంబరాల్లో మునిగిపోగా.. ఓడిన అభ్యర్థులు తమ ఓటమి గల కారణాలు వెతుక్కుంటున్నారు. ఇంత ఖర్చు పెట్టినా.. ఎలా ఓడిపోయాా అనుకుంటూ లోలోపల మథనపడిపోతున్నారు. నెక్స్ట్ టైం చూసుకుందాంలే అనుకొంటూ లైట్ తీసుకుంటున్నారు. ఇంకొందరు ఓడిన అభ్యర్థులు అయితే ఓటమిని జీర్ణించుకోలేపోతున్నారు. తమకు ఓటు వేయలేదు కాబట్టి ఇచ్చిన డబ్బులు, చీరలు, మందు, బహుమతులు తిరిగి ఇచ్చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రతి ఇంటికి తిరిగి మరీ వసూలు చేస్తున్నారు. తాజాగా.. మేడ్చల్ జిల్లా మూడుచింతలపల్లి మున్సిపాలిటీలో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. మూడుచింతలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 12వ వార్డులో పోటీ చేసిన కాంగ్రెస్ అభ్యర్థి ఎం.జ్యోతి ఓటమి పాలైంది. జ్యోతిపై బీఆర్ఎస్ అభ్యర్థి ఘన విజయం సాధించారు. దీంతో ఓటమి తట్టుకోలేకపోతే సదరు అభ్యర్థి ఎన్నికల ముందు తాను ఇచ్చిన డబ్బులు, చీరలు తిరిగి ఇవ్వమని, కుటుంబ సభ్యులతో కలిసి ఇంటింటికీ తిరిగి వసూలు చేస్తోంది. ఓటేయనప్పుడు నేను ఇచ్చిన చీరలు ఎందుకు తిరిగి ఇచ్చేయండి వసూలు చేస్తోంది. ఈ క్రమంలో చీరలు ఎవరు ఇవ్వమన్నారని సదరు అభ్యర్థిపై ఓటర్లు మండిపడుతున్నారు. తాము ఓటు వేయలేదని ఏంటి గ్యారంటీ అని ప్రశ్నిస్తున్నారు. అలాంటప్పుడు డబ్బులు, మందు, చీరలు ఎందుకు ఇచ్చావంటూ ప్రశ్నిస్తున్నారు. జ్యోతి మాత్రం.. తాను ఇంత ఖర్చు పెట్టినా.. 80 ఓట్లే వచ్చాయని.. ప్రత్యర్థికి నాలుగు ఓట్లు వస్తే తనకు ఒక్క ఓటు కూడా పడలేదని ఆవేదన వ్యక్తం చేస్తోంది. ఇక ఈ రాజకీయాలు తమకు అవసరం లేదని.. ఇచ్చిన రిటర్న్ ఇస్తే చాలని చెబుతోంది. మరోవైపు.. మూడు చింతలపల్లిలో మొత్తం 24 వార్డులుండగా.. ఇక్కడ బీఆర్ఎస్ పార్టీ 14 వార్డులును గెలుసుకుంది. మున్సిపల్ ఛైర్మన్ పీఠాన్ని దక్కించుకునే మెజార్టీ సాధించింది. కాంగ్రెస్ పార్టీ 9 వార్డులలో మాత్రమే విజయం సాధించగా.. బీజేపీ ఒకే ఒక స్థానానికి పరిమితమైంది. బీఆర్ఎస్‌కు ఈ మున్సిపాలిటీలో స్పష్టమైన మెజారిటీ దక్కడంతో చైర్మన్, వైస్ చైర్మన్ పీఠాలను కైవసం చేసుకుంది. కాగా, జ్యోతి డబ్బులు, చీరలు వసూలు చేసిన ఘటన స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.

## 'టెక్–బయో'లో శక్తి కేంద్రంగా తెలంగాణ




**హైదరాబాద్, ఫిబ్రవరి 15(తరంగాలు):** గ్లోబల్ టెక్–బయో రంగంలో తెలంగాణను పవర్ హౌస్‌గా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం 'బయో ఏషియా 2026' సదస్సును నిర్వహించనుంది. రాజధానిలోని హెచ్ఐసీసీలో ఈ నెల 17, 18 తేదీల్లో జరిగే ఈ సదస్సులో సుమారు 50 దేశాల నుంచి మూడు వేల మంది ప్రతినిధులు పాల్గొననున్నారు. హెల్త్ కేర్, లైఫ్ సైన్సెస్ రంగాలపై ప్రపంచంలోనే అతిపెద్ద సదస్సుగా బయో ఏషియాకు గుర్తింపు సంతరించుకుంది. 'టెక్–బయో అన్‌లీష్డ్: ఏఐ, ఆటోమేషన్–బయాలజీ రివల్యూషన్' అనే థీమ్‌తో నిర్వహిస్తున్న ఈ సదస్సును ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంత్రి శ్రీధర్ బాబుతో కలిసి ప్రారంభించనున్నారు. బయో టెక్నాలజీ, లైఫ్ సైన్సెస్, హెల్త్ కేర్, ఫార్మా రంగాల్లో ప్రపంచవ్యాప్తంగా పేరొందిన సంస్థల అధిపతులు, సీఈవోలు, ప్రతినిధులు, నిపుణులు, ఆవిష్కర్తలు చర్చలు, సమావేశాల్లో పాలుపంచుకుంటారు. ప్రధానంగా ఈ రంగాల్లో పురోగతి, కృత్రిమ మేధ (ఏఐ)తో వచ్చిన మార్పులపై చర్చలు జరగనున్నాయి. కొత్త ఆవిష్కరణలు, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం, దేశ విదేశాల సహకారం విషయంలో ఈ సదస్సు తెలంగాణకు ఉపయోగపడనుంది. అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ పెన్సిల్వేనియాకు చెందిన క్యాన్సర్ జీన్ థెరపీ నిపుణులు బ్రూస్ ఎల్ లెవిన్, అమ్జెన్ సంస్థ సీఎ?సవో హోవర్డ్ వై చాంగ్, జర్మనీకి చెందిన మిల్టెనీ బయోటెక్ వ్యవస్థాపకులు స్టెఫాన్ మిల్టెనీ, సానోఫీ సంస్థ ఈవీపీ మాడలీన్ రోచ్ వంటి ప్రముఖులు సదస్సులో కీలక ప్రసంగం చేయనున్నారు.

కేంద్ర మంత్రులు పీయూష్ గోయల్, అశ్వినీ వైష్ణవ్ కూడా హాజరుకానున్నారు. 'ఫార్మా–బయోటెక్ భవిష్యత్తు' అంశంపై జరిగే సమావేశంలో డాక్టర్ రెడ్డీస్, జైడస్, బయోకాన్, సిప్లా వంటి భారతీయ ప్రముఖ సంస్థల సీఈవోలు పాల్గొననున్నారు. నోవార్టిస్, రోష్, నోవో నార్డిస్క్, మెడ్‌ట్రానిక్, మెర్క్, అస్ట్రాజెనెకా వంటి అంతర్జాతీయ సంస్థల ప్రతినిధులతో ప్యానల్ చర్చలు జరుగుతాయి. దావోస్ సదస్సులో రేవంత్ రెడ్డి ప్రభుత్వం మలితరం లైఫ్ సైన్సెస్ విధానాన్ని ఆవిష్కరించి రాష్ట్రాన్ని ఆ రంగంలో ప్రపంచంలోని ప్రముఖ క్లస్టర్లలో ఒకటిగా నిలిపిందని, తద్వారా పెట్టుబడుల విస్తరణను వేగవంతం చేసిందని ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి.

# కొత్త ఉద్యోగంలో చేరిన జేడీ లక్ష్మీనారాయణ




**ఇంటర్నెట్ డెస్క్, తరంగాలు:** వాసగిరి వెంకట లక్ష్మీనారాయణ.. ఈ పేరు చెప్పగానే చాలా మందికి ఆయనెవరో గుర్తు రాకపోవచ్చు. కానీ జేడీ లక్ష్మీనారాయణ అంటే చాలు ఠక్కున గుర్తుపడతారు. సీబీఐ అధికారిగా జగన్ అక్రమాస్తుల కేసు సహా అనేక హై ప్రొఫైల్ కేసులను దర్యాప్తు చేయడంతో ఆయన పేరు అప్పట్లో మార్మోగింది. మహారాష్ట్ర కేడర్‌కు చెందిన ఐపీఎస్ అధికారి అయిన వీవీ లక్ష్మీనారాయణ .. ముంబైలో అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ జనరల్‌గా పదవీ విరమణ పొందారు. అనంతరం రాజకీయాల్లోకి వచ్చిన ఆయన జనసేన తరఫున విశాఖపట్నం ఎంపీగా పోటీ చేసి ఓడిపోయారు. ఆ తర్వాత 2023లో జై భారత్ నేషనల్ పార్టీ పేరిట సొంత పార్టీ పెట్టారు. అంతకు ముందు తూర్పుగోదావరి జిల్లా ధర్మవరంలో ఆయన పొలం కౌలుకు తీసుకొని వ్యవసాయం కూడా చేశారు. ఆయన కుమారుడు కూడా ఆలిండియా సర్వీసులో పని చేస్తున్నారు. జేడీ లక్ష్మీనారాయణ తాజాగా ఓ ఉన్నత ఉద్యోగంలో చేరారు. ఈవీట్రాన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లో ఆపరేషన్స్ విభాగంలో వైస్ ప్రెసిడెంట్‌గా ఆయన చేరారు. ఈవీ ట్రాన్స్ అనేది మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ ( మెయిల్)కు అనుబంధ సంస్థ. ఐపీఎస్ అధికారిగా దాదాపు మూడు దశాబ్దాలపాటు సుదీర్ఘ సేవలు అందించిన జేడీ లక్ష్మీనారాయణను ఈవీట్రాన్స్ వైస్ ప్రెసిడెంట్‌గా తీసుకోవడానికి కారణం ఉంది. జేడీ లక్ష్మీనారాయణ ఎన్ఐటీ వరంగల్ నుంచి మెకానికల్ ఇంజినీరింగ్‌లో బీటెక్ చదివారు. అనంతరం ఐఐటీ మద్రాస్ నుంచి ఎంటెక్ పూర్తి చేశారు. తర్వాత అశోక్ లేల్యాండ్ ఆర్ అండ్ డీ విభాగంలో కెరీర్ మొదలుపెట్టారు. ఆ సమయంలో కమర్షియల్ వెహికల్ సిస్టమ్, మాన్యుఫ్యాక్చరింగ్ ఎన్విరాన్మెంట్స్ మీద ఆయన అనుభవం సంపాదించారు. ఈవీట్రాన్స్ సంస్థ ఎలక్ట్రిక్ బస్సుల తయారీని వేగవంతం చేస్తోంది. ఈ క్రమంలో లక్ష్మీనారాయణ అనుభవం, కార్య దక్షత తమకు ఉపకరిస్తాయని ఆ సంస్థ భావిస్తోంది. లక్ష్మీనారాయణ నియామకం విషయాన్ని ఈవీట్రాన్స్ సంస్థ లింక్డ్‌ఇన్ ద్వారా స్వయంగా వెల్లడించింది. 2006–13 మధ్య డిప్యూటేషన్ మీద సీబీఐకి వెళ్లిన లక్ష్మీనారాయణ.. జాయింట్ డైరెక్టర్ స్థాయికి ఎదిగారని.. ఈ సమయంలో ఆయన అనేక హైప్రొఫైల్ కేసులను దర్యాప్తు చేశారని కూడా ఈవీట్రాన్స్ గుర్తు చేసింది. తెలంగాణ ఆర్టీసీలో నడుస్తోన్న ఒలెక్ట్రా ఎలక్ట్రిక్ బస్సులను ఈ సంస్థే తయారు చేసింది. ఒక్క తెలంగాణ ఆర్టీసీనే కాకుండా.. ముంబై, పుణే, గోవా తదితర ప్రాంతాల్లో ఈ సంస్థ తయారు చేసిన ఎలక్ట్రిక్ బస్సులు పరుగులు తీస్తున్నాయి. హైదరాబాద్ కేంద్రంగా పని చేస్తోన్న ఈవీట్రాన్స్.. దేశంలోనే అతిపెద్ద ఎలక్ట్రిక్ బస్ ఆపరేటర్‌గా అవతరించింది ఇదిలా ఉండగా.. లక్ష్మీనారాయణ భార్య ఇటీవల ఆన్‌లైన్ ఇన్వెస్ట్‌మెంట్ స్కామ్‌లో రూ.2.58 కోట్లు మోసపోయిన సంగతి తెలిసిందే. ట్రేడింగ్ నిపుణులమని పరిచయం చేసుకొని.. భారీ లాభాలు ఆశచూపిన స్కామర్లు ఊర్మిళను మోసం చేశారు. దీంతో లక్ష్మీనారాయణ దంపతులు జనవరి నెలలో సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించారు.

# కేటీఆర్‌పై వారంలో చార్జిషీట్!




**హైదరాబాద్, ఫిబ్రవరి 15 (తరంగాలు):** ఫార్ములా ఈ–కారు రేసు కేసుకు సంబంధించి ఏసీబీ అధికారులు ఈ వారమే కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయనున్నారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌ను ఏ1గా పేర్కొంటూ నేరాభియోగ పత్రాన్ని సిద్ధం చేస్తున్నారు. కేసు విచారణ దాదాపు పూర్తయిందని, న్యాయస్థానంలో చార్జిషీట్ దాఖలు చేయడమే తరువాయి అని ఉన్నతాధికారులు తెలిపారు. చార్జిషీట్‌కు ఇప్పటికే తుదిరూపం ఇచ్చిన ఏసీబీ అధికారులు.. ఈ కేసులో ఏ2గా ఉన్న ఐఏఎస్ అధికారి అర్వింద్‌కుమార్‌ను ప్రాసిక్యూట్ చేసేందుకు డీవోపీటీ అనుమతి కోసం ఆగారు. తాజాగా డీవోపీటీ నుంచి రాష్ట్ర ప్రభుత్వానికి అనుమతి రావడంతో ఆ విషయాన్ని ప్రభుత్వం ఏసీబీకి తెలియజేసింది. దీంతో ఏసీబీ అధికారులు ఈ వారంలో చార్జిషీట్ దాఖలుకు కావాల్సిన అన్ని పత్రాలను సిద్ధం చేసుకుంటున్నారు. ఇందుకు కీలకమైన పలు ఎలక్ట్రానిక్, డిజిటల్ సాక్ష్యాధారాలను సేకరించారు. ఫార్ములా ఈ–కారు రేసు వల్ల హెచ్ఎండీఏకు రూ.75.88 కోట్ల నష్టం జరిగిందన్న విషయాన్ని రుజువు చేయడానికి కావాల్సిన అన్ని ఆధారాలను సేకరించారు. ఫార్ములా ఈ–ఆపరేషన్స్ సంస్థతో ఒప్పందం చేసుకున్న ఏస్ నెక్స్ట్‌జెన్ కంపెనీకి కారు రేసు బాధ్యతలు అప్పగించడం, దానికి ప్రతిఫలంగా ఆ సంస్థ నుంచి బీఆర్ఎస్ పార్టీకి రూ.45 కోట్ల ఎలక్టోరల్ బాండ్లు రావడం క్విడ్ ప్రోకోలో భాగమేనన్న విషయాన్ని చార్జిషీట్‌లో ఏసీబీ అధికారులు పొందుపరచనున్నట్లు తెలుస్తోంది. కేటీఆర్ ప్రాసిక్యూషన్‌కు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ గతేడాది నవంబరులో అనుమతి ఇచ్చిన విషయం తెలిసిందే. కాగా, ఫార్ములా ఈ–కారు రేసుకు సంబంధించి 2024 డిసెంబరు 18న ఏసీబీ ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. దీని ఆధారంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) మరో కేసు నమోదు చేసింది. ఈ మేరకు అర్వింద్‌కుమార్, బీఎల్ఎన్ రెడ్డి, కేటీఆర్‌లను ఈడీ, ఏసీబీ అధికారులు విచారించారు. చార్జిషీట్‌లో కేటీఆర్ తదితరులు నిధుల దుర్వినియోగానికి, మోసానికి పాల్పడ్డారని, నేరపూరిత కుట్రలో భాగస్వామి అయ్యారని, ఇతరులకు లాభం కలిగించే విధంగా ప్రవర్తించారని ఏసీబీ అధికారులు పేర్కొనబోతున్నట్లు సమాచారం.

# రైతు భరోసాపై కీలక అప్డేట్..

తెలంగాణ మున్సిపల్ ఎన్నికల విజయంతో అధికార కాంగ్రెస్ ఫుల్ జోష్‌లో ఉంది. ఇదే ఉత్సాహంలో రైతులకు రైతు భరోసా పంట పెట్టుబడి సాయం అందించేందుకు సర్కార్ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. అందుకు ముహూర్తం కూడా ఫిక్స్ చేసిందట. ఫిబ్రవరి 17వ తేదీన రైతు భరోసా నిధులు అకౌంట్లో జమ కానున్నట్లు సమాచారం. ఇక గతంలో మాదిరి కాకుండా ఈసారి ప్రభుత్వం ఒకే విడతలో రైతుభరోసా నిధులను విడుదల చేయనున్నట్లు విశ్వసనీయవర్గాల సమాచారం. ఇప్పటివరకు ఎకరాల చొప్పున డబ్బులు విడుదల చేసేవారు. ముందు ఒకరం, రెండు ఒకరాల వరకు.. ఆ తర్వాత 5 ఎకరాల వరకు.. ఆ తర్వాత 10 ఎకారల వరకు ఇలా విడతల వారీగా రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేసేవారు. అయితే ఈ మొత్తం ప్రక్రియ పూర్తయ్యేసరికి 9 రోజుల సమయం పట్టేది. ఈసారి రైతు భరోసా పంట పెట్టుబడికి అన్నదాతలు ఎదురుచూడాల్సిన అవసరం లేకుండా ప్రభుత్వం ఒకే విడతలో రైతుల ఖాతాల్లో డిపాజిట్ చేయనున్నట్లు సమాచారం. ఈ నిర్ణయం పట్ల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. దీనిలో భాగంగా.. రైతు భరోసా నిధుల విడుదల కోసం రేవంత్ సర్కార్ నిధులను సమీకరించుకుంది. వాస్తవానికి మున్సిపల్ ఎన్నికలకు ముందే రైతు భరోసా పంట పెట్టుబడి సాయం విడుదల చేయాలని భావించారు. అయితే అనుకోని కారణాలు, ఆ తర్వాత మున్సిపల్ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కావటంతో నిధుల విడుదల ఆలస్యమైంది. ఇటీవల ఎన్నికల ప్రచారంలో భాగంగా మిర్యాలగూడ సభ ప్రసంగించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతు భరోసా నిధులపై క్లారిటీ ఇచ్చారు.

# లేత ప్రాయానికి పెద్ద బరువు

**హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 14 (తరంగాలు):** వారిది ఇంకా ఆడిపాడే వయసే.. ఎదిగీ ఎదగని మనస్సే.. చదివేది ఏడో, ఎనిమిదో తరగతి.. ఆ స్థితిలోనే వారు యుక్త వయసులోకి అడుగు పెడుతున్నారు. లేత ప్రాయంలోనే రజస్వల (ఎర్లియర్లీ మెచ్యూర్) అవుతున్నారు. గతంలో 13 – 15 సంవత్సరాల వయసు వచ్చిన తర్వాత ఆడపిల్లలు మెచ్యూర్‌అయితే.. ఇప్పుడు 9–11 ఏళ్లకే మెచ్యూర్ అవుతున్నారు. వైద్య పరిభాషలో దీనిని ప్రికాషియస్ ప్యూబర్టీ అంటారు. దీనివల్ల బాలికలతోపాటు వారి తల్లిదండ్రులు కూడా మానసిక క్షోభకు గురవుతున్నారు. దీన్నినివారించటానికి హార్మోన్ ఇంజెక్షన్లను ఆశ్రయిస్తున్నారు. ఇటీవలి కాలంలో ఈ ఇంజెక్షన్ల వాడకం పెరిగిందని వైద్యులు చెబుతున్నారు. అయి తే, అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించిన తర్వాత వీటి అవసరం ఉంటేనే ఇవ్వాలని సూచిస్తున్నారు.



## నేనే రాజు, నేనే మంత్రి వ్యాఖ్యలపై క్లారిటీ ఇచ్చిన సీఎం రేవంత్ రెడ్డి

ఇటీవల ఢిల్లీలో నిర్వహించిన చిట్ చాట్‌లో నేనే రాజు, నేనే మంత్రి అంటూ రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు తీవ్ర విమర్శలకు కారణం అయ్యాయి. ఈ నేపథ్యంలోనే తాజాగా ఆ వ్యాఖ్యలకు క్లారిటీ ఇచ్చే ప్రయత్నం చేశారు. తాను చేసిన వ్యాఖ్యలను తప్పుగా అర్థం చేసుకున్నారని పేర్కొన్న రేవంత్ రెడ్డి.. నేనే సీఎం, నేనే మున్సిపల్ మంత్రిని అని చెప్పానని వెల్లడించారు. మున్సిపల్ ఎన్నికల్లో గెలుపోటములకు తనదే బాధ్యత అని చెప్పినట్లు స్పష్టం చేశారు.

## అసలు ఊహించామా ఇంతమంది పాఠకులను!

2022 వరకూ తెలుగు సాహిత్య స్థితిగతులు బయట ప్రపంచం దృష్టిలో పెద్ద చడీచప్పుడు లేకుండా ఉండేవి. ఉన్న కొద్దిమంది రచయితలో వారిలో వారు సాహిత్యాన్ని గురించి, రచనలను గురించి చర్చించుకుంటూ ఉండేవారు. ఒకరు రాసింది ఇంకొకరు చదవరనీ, సాహిత్యం పట్ల యువతలో ఆసక్తి సన్నగిల్లిపోతోందనీ రకరకాలుగా మాట్లాడుకుంటూ ఉండేవారు. ఈ పరిస్థితిని మార్చడానికి తోచిన పద్ధతిలో కొంతమంది సాహిత్యవేత్తలు, ప్రభుత్వేతర సంస్థలు ప్రయత్నాలు చేస్తూండేవి. నవలల పోటీలు నిర్వహించడం, ఉత్తమ కథలను ఎంపిక చేసి సంచికలు తీసుకురావడం వగైరా ప్రయత్నాలు అందులో భాగంగా ఉండేవి. కానీ, ఇవేమీ ఆ కాస్త సాహిత్యలోకాన్నీ దాటుకుని పుస్తకాలు ముట్టుకోని జనాలపై ప్రభావం చూపించేవి కాదు. ఎవరైనా పుస్తకాలు చదవడానికి ఆసక్తి చూపించినా ఇళ్ళలో పెద్దవాళ్ళ నుంచి కాలేజీ లెక్చరర్ల వరకూ ప్రతీవారూ ఇంగ్లీష్ పుస్తకాలు చదవమని ప్రోత్సహించేవారు. ఇంగ్లీష్ పుస్తకాలు చదివితే కనీసం ఇంగ్లీష్ అయినా నేర్చుకోవచ్చు అని ఉచిత సలహాలు వచ్చేవి. ఇక క్రమేపీ డిజిటల్ కంటెంట్, అందులోనూ రీల్స్, షార్ట్స్ వంటివి ప్రాచుర్యం చెందుతూ ఉండడంతో అసలంటూ పుస్తకాలకే చోటు తగ్గిపోతున్న ప్రపంచంలో తెలుగు పుస్తకాలకు కాలం చెల్లిపోయినట్టే అందరూ భావించారు. మొత్తంగా, ఒక పుస్తకం 2000 నుంచి 4000 వేల కాపీలు విడుదలైన కొద్ది సంవత్సరాల్లో అమ్మగలిగితే అప్పట్లో గొప్ప విజయం సాధించినట్టే. బహుశా, కొద్ది మినహాయింపులు తప్ప పలు భారతీయ భాషల సాహిత్యవేత్తలు, పాఠకులు ఈ పరిస్థితిని రిలేట్ చేసుకోగలరు అనుకుంటాను. అయితే, 2024--25 సంవత్సరాల్లో ఈ పరిస్థితి పూర్తిగా మారిపోయింది. 2023 వరకూ తెలుగులో అత్యధికంగా అమ్ముడుపోయిన పుస్తకాల కేటగిరీలో కొన్ని వేల కాపీలు అమ్ముడైన పుస్తకాలూ, ఆంగ్ల బెస్ట్ సెల్లర్ల తాలూకు అనువాదాలూ, కొన్ని దశాబ్దాల క్రితం నాటి క్లాసిక్స్ వంటివి ఉండడం పరిపాటి కాగా ఈ స్థితి 2024 నాటికి మారిపోయింది. ఐర్లాండ్‌లో స్థిరపడ్డ ఎన్నారై రవి మంత్రి రాసిన ఒక కొత్త ప్రేమకథాత్మక నవల -- 'అమ్మడైరీలో కొన్ని పేజీలు' 2024 సంవత్సరంలోనే కొన్ని నెలల వ్యవధిలో వేగం పుంజుకుని లక్ష కాపీలు అమ్ముడై సంచలనం సృష్టించింది. ఈ నవల ఇదే వేగాన్ని 2025లోనూ కొనసాగిస్తూ లక్షా డెబ్భై అయిదువేల కాపీలు అమ్ముడైంది. పైగా పుస్తకాలు పట్టుకోరన్న అభిప్రాయం ఉన్న యువతలోకి ఈ నవల చొచ్చుకుపోవడం చాలామంది సాహిత్యపరులకు ఆశ్చర్యకరంగా తోచింది. ఇన్‌స్టాగ్రామ్‌లో ఈ నవల చదువుతున్నట్టు వీడియోలు చేయటం, చదివి రివ్యూలు పోస్ట్ చేయడం ఒక ట్రెండ్‌గా మారింది. ఇన్ని పుస్తకాలు నిజంగా అమ్ముడు కావట్లేదని, ఇదంతా కేవలం మార్కెటింగ్ గిమ్మిక్ కావచ్చని ఈ పరిణామాన్ని చూసి సందేహపరులు అనుమానించారు. అయితే, జాతీయ స్థాయిలో అమెజాన్ ట్రెండ్స్‌లో యువల్ నోవా హరారీ, సుధామూర్తి, అరుంధతీ రాయ్ వంటివారి రచనలను, 'సైకాలజీ ఆఫ్ మనీ', 'అటామిక్ హాబిట్స్' లాంటి పుస్తకాలను దాటుకుని నెంబర్ 1 సెల్లర్‌గా నెలల పాటు నిలబడుతూ ఉండడమూ, చివరకు 2014లో అమెజాన్ ఇండియా ప్రకటించిన టాప్ 10 పుస్తకాల్లో రెండోస్థానంలో నిలవడమూ ఈ సందేహాలను పటాపంచలు చేశాయి. హైదరాబాద్ బుక్ ఫెయిర్, విజయవాడ బుక్ ఫెయిర్ వంటిచోట్ల కూడా ఈ పుస్తకాన్ని జనం కొనడమూ, రచయిత భారతదేశానికి తిరిగివచ్చినప్పుడు హైదరాబాద్‌లో జరిగిన వివిధ 'మీట్ ద ఆథర్' కార్యక్రమాలకు భారీ స్పందన రావడమూ వంటివి కూడా ఈ కొత్త పరిణామాన్ని కళ్ళకు కట్టాయి. రవి మంత్రి 2024లోనే ఆన్‌లైన్‌లో కాంటెంట్ క్రియేటర్‌గా, ఇన్‌ఫ్లుయెన్సర్‌గా విజయవంతం అవుతూ ఉండడంతో ఇదంతా కేవలం ప్రచారార్భాటం వల్ల జరిగిన ఒక వన్ ఆఫ్ పరిణామం అని తెలుగు సాహిత్యాన్ని దశాబ్దాలుగా గమనిస్తున్న చాలామంది కొట్టిపారేశారు. అయితే, యువ సాహిత్యకారులు కడలి సత్యనారాయణ రాసిన 'చిక్ లిట్', మహమ్మద్ గౌస్ రాసిన '826 కిమీ', ప్రసాద్ రామతోట రాసిన '90స్ లవ్‌స్టోరీ', శ్రీనివాస్ కాశెట్టి రాసిన 'అయోధ్య చేరిన కృష్ణ'... ఇవన్నీ కొన్ని నెలల వ్యవధిలోనే పదుల వేల కాపీలు దాటాయి. 'అమ్మడైరీలో కొన్ని పేజీలు' పుస్తకం లక్షన్నర కాపీలు అమ్ముడై సంచలనం సృష్టించడానికి ముందే వి. మల్లికార్జున్ 'ఇరానీ కేఫ్', సీతారామరాజు 'రామగ్రామ నుంచి రావణలంకకు' వంటి పుస్తకాలు కొద్ది నెలల్లోనే పలు రీప్రింట్లతో కొత్త పాఠకులను సంపాదించాయి. దీన్ని బట్టి కూడా ఇదేమీ హఠాత్తుగా రాత్రికి రాత్రి వచ్చిన పరిణామం కాదని అర్థమవుతుంది. మరోవైపు, వివిధ పబ్లికేషన్లు, ఆడియో బుక్స్ యాప్‌లు వంటివి కూడా అభివృద్ధి చెందుతున్నాయి (అజు పబ్లికేషన్స్, అన్వీక్షికి పబ్లిషర్స్, ఛాయ బుక్స్, ఎలమి పబ్లికేషన్స్ వంటి పబ్లిషింగ్ సంస్థలు, దాసుభాషితం వంటి ఆడియో బుక్స్ యాప్‌లు ఇందుకు ఉదాహరణ.). ఇన్‌స్టాగ్రామ్‌లో పుస్తకాల గురించి చర్చించి, వాటిని ప్రమోట్ చేసే బుక్‌ఫ్లుయెన్సర్లు ఈ పరిణామంలో ఒక కీలకమైన తోడ్పాటును అందిస్తున్నారు (తెలుగు కలెక్టివ్, ఆరుద్ర ఈశ్వర్, విముక్త సుధ వంటివారు ఇందుకు ఉదాహరణ). మొత్తంగా, ప్రభుత్వ ప్రోత్సాహం, పెద్ద సంస్థల మద్దతు, సినిమా ప్రముఖుల ప్రోత్సాహం... ఇవేమీ లేకుండా ఒక ఎకోసిస్టమ్ అభివృద్ధి చెందుతున్నట్టు కనిపిస్తోంది. ఎందుకని ఈ పుస్తకాలు అమ్ముడవుతున్నాయి? ఎవరు కొంటున్నారు? ఎందుకు కొంటున్నారు? ఎలాంటి పుస్తకాలు అమ్ముడవుతున్నాయి? వంటి విషయాలపై అనక్‌డోటల్ రిఫరెన్సులు మినహాయిస్తే పరిశోధనలు కానీ, స్టడీలు కానీ పెద్దగా జరిగినట్టు కనిపించడం లేదు. ఇన్‌స్టాగ్రామ్ వంటి వేదికల్లో చేసిన ప్రచారం వల్ల పుస్తకాలు అమ్ముకోగలుగుతున్నారని విమర్శనాత్మకంగా రాస్తున్నవారు కూడా పాఠకులు ఎందుకు కొంటున్నారో, ఈ పుస్తకాల్లో ఏం ఆకర్షిస్తోందో లోతుగా పరిశీలించిన దాఖలాలు లేవు. తెలుగు కలెక్టివ్ అన్న ఇన్‌స్టాగ్రామ్ పేజీని స్థాపించి దాన్ని ఒక సాహిత్య, సాంస్కృతిక సముదాయంగా అభివృద్ధి చేస్తున్నవారిలో ఒకడైన ఆదిత్య అన్నావఝుల ఈ విషయంపై మాట్లాడుతూ, "యంగ్‌స్టర్స్ వాళ్ళని వాళ్ళు చూసుకునేలాంటి రిలేటబుల్ కంటెంట్ ఉండడం, సులువుగా అర్థమయ్యే భాషలో రాయడం బాగా లాభిస్తోంది. సాహిత్యంలో సామాన్యంగా ఉండే వివిధ వాదాలకు ఈ రచనలు సామాన్యంగా దూరంగా ఉంటున్నాయి. ఇన్‌స్టాగ్రామ్‌లో ట్రెండ్ కావడం, అమెజాన్ ప్లాట్‌ఫాంలో సజెషన్లు వంటివీ, పుస్తక ప్రచురణ విషయంలో ఇంతకుముందున్న బేరియర్స్ తగ్గిపోవడం ఈ మార్పు విషయంలో దోహదం చేసింది" అన్నాడు. 1990ల్లో ప్రారంభమైన ఇండస్ట్రియలైజ్డ్ ఎంట్రన్స్ ఎగ్జామ్ కోచింగ్ మోడల్ వల్ల భాషకు, సాహిత్యానికి దూరమైపోయిన తరాలు తిరిగి వాటివైపు ఆకర్షితులవుతున్నాయా? షార్ట్ ఫామ్ కంటెంట్‌కి అడిక్ట్ అయ్యారనీ, భారతీయ భాషల పట్ల ఆసక్తి చూపట్లేదనీ అంతా భావించే యువత తిరిగి లాంగ్‌ఫామ్ కంటెంట్ వైపు వస్తున్నార నేందుకు, అందులోనూ భారతీయ భాషల పుస్తకాలపై ఆసక్తి చూపుతున్నారనేందుకు ఈ ట్రెండ్ తొలి సంకేతమా? ఈ కోణాల్లో మరింత లోతుగా పరిశీలించి తెలుసుకోవాల్సి ఉంది.

# లాసెట్, ఎడ్సెట్ దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం

**– మే 4న ప్రవేశ పరీక్షలు.. 18న తుది ర్యాంకుల వెల్లడి**

**తిరుపతి జిల్లా బ్యూరో, తరంగాలు:**
రాష్ట్రంలో లాసెట్, ఎడ్సెట్ –2026 ప్రవేశ పరీక్షలకు దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమైంది. లాసెట్ 2026: లాసెట్ కు మార్చి 12వరకు దరఖాస్తులు చేసుకోవచ్చు. అనంతరం రూ.వెయ్యి అపరాధ రుసుముతో 16 వరకు, రూ.2వేలతో 20వరకు, రూ.4వేలతో 24వరకు, రూ.10వేలతో మార్చి 28 వరకు దరఖాస్తులు చేసుకోవచ్చని సూచించింది.లిమార్చి 30న దరఖాస్తుల్లో తప్పుల సవరణకు అవకాశం కల్పిస్తోంది. ఏప్రిల్ 20న హాల్ టికెట్లు విడుదల చేసి మే 4న ప్రవేశ పరీక్ష, 18న తుది ఫలితాలను ప్రకటించనుంది. ఎడ్సెట్ 2026: ఎడ్సెట్ కు మార్చి 9వరకు దరఖాస్తుల సమర్పణకు గడువు ఇచ్చింది. అనంతరం రూ.వెయ్యి అపరాధ రుసుముతో మార్చి 13వరకు, రూ.2వేలతో 17వరకు, రూ.4వేలతో 21వరకు, రూ.10వేలతో 25వరకు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించింది. మార్చి 26న దరఖాస్తుల్లో తప్పుల సవరణకు అవకాశం కల్పించగా ఏప్రిల్ 20న హాల్టికెట్లు అందుబాటులో ఉంచనుంది. మే 4న ఆన్లైన్లో మధ్యాహ్నం 2 నుంచి 4గంటల వరకు ఎడ్సెట్ పరీక్ష నిర్వహించి 18న తుది ర్యాంకులు ప్రకటించనుంది.

# అనధికారికులకు డబ్బులు కట్టకండి: కమిషనర్

**తిరుపతి జిల్లా బ్యూరో (డిఎస్), తరంగాలు:**



తిరుపతిలో తోపుడు బండ్లు, పండ్లు, పూలు, కూరగాయలు విక్రయించే వారి నుంచి ఎవరైనా అనధికారిక వసూళ్లకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని కమిషనర్ మౌర్య హెచ్చరించారు. 'ఇందిరా ప్రియదర్శిని కూరగాయల మార్కెట్ టెండర్‌దారుడు నగదు చెల్లించకపోవడంతో టెండర్ రద్దు చేశాం. మార్కెట్‌లో కార్పొరేషన్ సిబ్బందే వసూళ్లు చేస్తున్నారు. తమ సిబ్బంది కాకుండా ఎవరైనా డబ్బులు అడిగితే 9000822909కు కాల్ చేయండి' అని కమిషనర్ సూచించారు.

# నిరాశ్రయుల పట్ల సేవాభావంతో మెలగండి.



**తిరుపతి జిల్లా బ్యూరో, తరంగాలు:**
నిరాశ్రయుల పట్ల సేవాభావంతో వ్యవహరించాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య తెలిపారు. గురువారం రాత్రి పట్నూల్ వీధి వద్ద మెప్మా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిరాశ్రయుల కేంద్రాన్ని కమిషనర్ పరిశీలించారు. అక్కడ వారికి అందుతున్న సౌకార్యాలను అడిగి తెలుసుకున్నారు. ఆహార పదార్థాలను రుచి చూసి వడ్డించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నిరాశ్రయుల పట్ల సేవాభావంతో వ్యవహరించాలని తెలిపారు. వారికి కావలసిన అన్ని సౌకర్యాలు కల్పించాలని నిర్వాహకులను ఆదేశించారు. ఆర్. ఓ. వాటర్ ప్లాంట్ కావాలని అడిగారని ఏర్పాటు చేస్తామని అన్నారు. కమిషనర్ వెంట మెప్మా సి.ఎం.ఎం. లు కృష్ణవేణి, సోము, అమ్మ సేవా ట్రస్ట్ నిర్వాహకులు, ఉన్నారు.

# స్వర్ణరథంపై శ్రీ కళ్యాణ వేంకటేశ్వరస్వామివారి కటాక్షం

**– పెద్ద సంఖ్యలో రథాన్ని లాగిన మహిళలు**



**తిరుపతి జిల్లా బ్యూరో , తరంగాలు:**
శ్రీనివాసమంగాపురం శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాల్లో ఆరో రోజైన శుక్రవారం సాయంత్రం 4 నుండి 5 గంటల వరకు స్వర్ణరథోత్సవం కన్నులపండుగగా జరిగింది. శ్రీదేవి భూదేవి సమేత శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారు ధగధగ మెరుస్తున్న స్వర్ణరథాన్ని అధిరోహించి భక్తులను అనుగ్రహించారు. భక్తులు అడుగడుగునా కర్పూరహారతులు సమర్పించి స్వామివారిని దర్శించుకున్నారు. శ్రీవారికి శ్రీభూదేవులు ఇరువైపుల ఉంటారు. శ్రీదేవి(లక్ష్మి) బంగారు. స్వర్ణరథం శ్రీనివాసునికి అత్యంత ప్రీతిపాత్రమైనది. ఈ స్వర్ణరథోత్సవాన్ని దర్శించడంవల్ల– లక్ష్మీదేవి కరుణతో సంపదలు, భోగభాగ్యాలూ; భూదేవి కరుణతో, సమస్తధాన్యాలూ, శ్రీవారికరుణతో సర్వశుభాలూ, సుఖాలూ చేకూరుతాయని విశ్వాసం . ఈ కార్యక్రమంలో ఆలయ ప్రత్యేక శ్రేణి డెప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపీనాథ్, సూపరింటెండెంట్ రాజ్ కుమార్ , కంకణభట్టర్ బాలాజీ రంగాచార్యులు, టెంపుల్ ఇన్స్పెక్టర్లు ముని కుమార్, ధన శేఖర్, ఆలయ అర్చకులు విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాల్లో భక్తులకు రుచికరమైన అన్నప్రసాదాలు

- దాతల సహకారంతో రోజుకు సుమారు 3 వేల మందికి భోజన వితరణ
- మధ్యాహ్నం తొమ్మిది రకాల వంటకాలతో మహా ప్రసాదం
- అన్నప్రసాదాలపై భక్తుల హర్షం



**తిరుపతి జిల్లా బ్యూరో, తరంగాలు:**
తిరుపతి: శ్రీనివాసమంగాపురం శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా వేలాదిమంది భక్తులు విచ్చేస్తుండగా, వారి సౌకర్యార్థం టీటీడీ దాతల సహకారంతో ప్రతిరోజూ రుచికరమైన అన్నప్రసాదాలను నిరంతరాయంగా అందిస్తోంది. భక్తులు ఈ సేవపై ఆనందం వ్యక్తం చేస్తూ టీటీడీకి కృతజ్ఞతలు తెలుపుతున్నారు. తిరుమల శ్రీవారి దర్శనార్థం వచ్చే భక్తులకు టీటీడీ అనాదిగా ఉచిత అన్నప్రసాద వితరణను యజ్ఞంగా నిర్వహిస్తోంది. ఇదే విధంగా టీటీడీ అనుబంధ ఆలయాల్లో కూడా దాతల సహకారంతో అన్నప్రసాదాల వితరణకు ప్రత్యేక చర్యలు చేపట్టింది. ప్రతిరోజూ ఉదయం సుమారు 700 మంది భక్తులకు పొంగలి, సేమియా ఉప్మా, టమాటా రైస్, కిచిడి, వెజ్ రైస్, చట్నీ, కేసరి వంటి పదార్థాలు అందిస్తున్నారు. మధ్యాహ్నం అన్నం, ఆకుకూర పప్పు, చట్నీ, సాంబారు, రసం, పెరుగు, అప్పడాలు, స్వీటు, అరటిపండు తదితర తొమ్మిది రకాల వంటకాలతో మహా ప్రసాదం వడ్డిస్తున్నారు. రాత్రి సుమారు 700 మందికి దొండకాయ రైస్, కిచిడి, టమాటా రైస్, వెజ్ రైస్ అందిస్తున్నారు. అదనంగా, టీటీడీ అన్నప్రసాదం విభాగం ఆధ్వర్యంలో ప్రతిరోజూ ఉదయం పొంగలి, ఉప్మా, వడ, చట్నీ, సాంబారు; మధ్యాహ్నం, రాత్రి సాంబారు అన్నం, పెరుగు అన్నం నిరంతరాయంగా పంపిణీ చేస్తున్నారు. శుభ్రత, రుచితనం, సమయపాలనతో నిర్వహిస్తున్న ఈ అన్నప్రసాద సేవ భక్తుల ప్రశంసలు అందుకుంటోంది.

# పన్ను ఎగవేత నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలి

**– జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్**



**తిరుపతి జిల్లా బ్యూరో,తరంగాలు:**
జిల్లా స్థాయిలో అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేసి, పన్ను ఎగవేత నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్ తెలిపారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ లోని మినీ సమావేశ మందిరము నందు జిల్లా కలెక్టర్, డిఆర్ఓ నరసింహులు, జాయింట్ కమిషనర్ కమర్షియల్ టాక్సెస్ ఞ జీఎస్టీ, చిత్తూరు డివిజన్, ఏ. రవీంద్రనాథ్ రెడ్డి తో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు, జిల్లా రిజిస్ట్రార్ శ్రీరామ్ కుమార్, ఎల్ డి ఎం రవి కుమార్, సంబంధిత శాఖల లైన్ డిపార్ట్మెంట్ అధికారులు, మున్సిపల్ కమిషనర్ లతో జీఎస్టీ శాఖలో కొనసాగుతున్న కార్యక్రమాలపై జీఎస్టీ కోఆర్డినేషన్ కమిటీ సమావేశమును నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. జీఎస్టీ అరియస్ కలెక్షన్, పన్ను ఎగవేత కేసుల పరిశీలన మరియు వాటి పరిష్కారానికి అవసరమైన విభాగాల మధ్య సమన్వయం అంశాలపై విస్తృతంగా చర్చించారు. పన్ను ఎగవేత కేసుల్లో పోలీస్ శాఖ సహకారం కీలకమని పేర్కొన్నారు. జీఎస్టీ అధికారులు ఫిర్యాదులు నమోదు చేయడానికి పోలీస్ స్టేషన్లను సంప్రదించి నప్పుడు, సంబంధిత కేసులను నమోదు చేసి దర్యాప్తు చేపట్టడంలో పూర్తి సహకారం అందించాలని తెలిపారు. అదేవిధంగా, పన్ను ఎగవేతకు సంబంధించిన ఆస్తులను గుర్తించినప్పుడు, వాటిని రిజిస్ట్రేషన్ శాఖ ద్వారా 22–ఎ కింద నమోదు చేసి, తదుపరి లావాదేవీలకు అనుమతించకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. పన్ను ఎగవేత దారులకు సంబంధించిన బ్యాంకు లావాదేవీల వివరాలను సకాలంలో అందజేయాలని లీడ్ బ్యాంక్ మేనేజర్ గారిని తెలియజేశారు. జిల్లా స్థాయిలో అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేసి,పన్ను ఎగవేత నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో వరలక్ష్మి, రేణుక, ఏ. శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వానికే పట్టం కట్టారని రాష్ట్ర ప్రజలకు కృతజ్ఞతలు తెలిపిన: రేవంత్ రెడ్డి




**ఖమ్మం, తరంగాలు:**
హైదరాబాద్ : రాష్ట్రవ్యాప్తంగా 116 మున్సిపాలిటీలు, ఏడు మున్సిపల్ కార్పొరేషన్ల పరిధిలో జరిగిన ఎన్నికల్లో అత్యధిక స్థానాల్లో కాంగ్రెస్ పార్టీకి అఖండ విజయాన్ని కట్టబెట్టిన రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి శ్రీ ఏ. రేవంత్ రెడ్డి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ విజయం లక్షలాది కాంగ్రెస్ కార్యకర్తల శ్రమ ఫలితమని, పార్టీ పట్ల వారికి ఉన్న అపారమైన అభిమానానికి ఇది నిదర్శనమని పేర్కొన్నారు. భుజాలు కాయలు కాసేలా పార్టీ జెండాను మోసి, ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లిన ప్రతి కార్యకర్తకు ఈ విజయాన్ని అంకితం చేస్తున్నామని తెలిపారు. అదేవిధంగా, రాష్ట్రంలో రెండేళ్ల ప్రజాపాలన, పేద––మధ్యతరగతి ప్రజల సంక్షేమం, ప్రపంచ స్థాయి ప్రణాళికలు, కార్యాచరణతో ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజలు ఈ తీర్పు ద్వారా తమ సంపూర్ణ ఆమోదం తెలిపారని అన్నారు. ఈ విజయం తమ బాధ్యతను మరింత పెంచిందని పేర్కొన్న ముఖ్యమంత్రి గారు, రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం, పారదర్శక పాలనకు పునరంకితమవుతూ భవిష్యత్తులో ప్రతి మున్సిపాలిటీ, మున్సిపల్ కార్పొరేషన్‌ను మరింత అభివృద్ధి చేసి ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని స్పష్టం చేశారు.

# గెలవలేక కాంగ్రెస్ అనైతికంగావ్యవహారిస్తుంది



**ఖమ్మం, తరంగాలు:**
రాష్ట్రంలో అధికారంలో ఉండి కూడా ప్రజల ఆశీస్సులు పొందలేక, అధికారంలో ఉన్న కాంగ్రెస్ అనైతిక చర్యలకు పాల్పడుతోందని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర నిశితంగా విమర్శించారు. కొత్తగూడెం కార్పొరేషన్ 32 వ డివిజన్ లో బీఆర్ఎస్ నుంచి గెలిచిన గుగులోత్ రాంబాబును పోలీసులతో బెదిరించి తీసుకెళ్ళారని ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసే విధంగా కాంగ్రెస్ వికృత చర్యలకు పాల్పడుతున్నదని ఎంపీ రవిచంద్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల దీవెనలతో గెలిచిన తమ అభ్యర్థులను బెదిరించి అక్రమంగా మేయర్ పీఠాన్ని దక్కించుకోవాలని కాంగ్రెస్ కుయుక్తులు పన్నుతుందని ఆయన మండిపడ్డారు. బెదిరించి రాంబాబును ఎత్తుకెళ్లిన పోలీసులు తిరిగి వెంటనే ఆయన కుటుంబ సభ్యులకు అప్పగించాలని ఎంపీ రవిచంద్ర డిమాండ్ చేశారు. పోలీసులు అధికార పార్టీ కార్యకర్తల మాదిరిగా పనిచేస్తున్నారని ఆయన విమర్శించారు. పోలీసులు ప్రజాస్వామ్యయుతంగా వ్యవహరించకపోతే, భవిష్యత్తులో జరగబోయే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని ఎంపీ రవిచంద్ర హెచ్చరించారు. కొత్తగూడెం ప్రజల తీర్పును బీఆర్ఎస్ స్వాగతిస్తుందని, ప్రజలెదుర్కొంటున్న తక్షణ సమస్యల పరిష్కారం కోసం బీఆర్ఎస్ ఇదేవిధంగా పోరాటాన్ని పోరాడుతుందని ఎంపీ వద్దిరాజు చెప్పారు.

# రూ. 60 లక్షలతో ఏటీఎం వాహన డ్రైవర్ పరార్



**హైదరాబాద్ న్యూస్ తరంగాలు:**
హైదరాబాద్ :ఏటీఎంలలో నింపేందుకు నగదును తీసుకొచ్చిన వాహనంతో డ్రైవర్ ఉడాయించిన ఘటన గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం చోటుచేసుకుంది. నిందితుడు తెల్లాపూర్‌లో వాహనం వదిలేసి రూ. 60 లక్షల నగదుతో పరారయ్యాడు. ఇన్‌స్పెక్టర్ బాలరాజు తెలిపిన ప్రకారం సంగం సెక్యూరిటీ సొల్యూషన్స్ సంస్థ యాక్సిస్ బ్యాంక్ ఏటీఎంలలో క్యాష్ మెయింటెనెన్స్ సర్వీస్ (సీఎంఎస్) విధులు నిర్వహిస్తోంది. తిరుమలగిరి సిక్ రోడ్డులో నివసించే డ్రైవర్ బడిగేరి అజిత్ కుమార్ అలియాస్ శివ, ఇద్దరు కస్టోడియన్లు ఎస్.రామకృష్ణ, ఎం.డి.మాలిక్, గార్డు పెరుమాల్.. ఏటీఎంలలో క్యాష్ లోడ్ చేసేందుకు సీఎంఎస్ వాహనం (టీఎస్ 10 యూడీ 0393)లో బయలుదేరారు. గురువారం సాయంత్రం 4:45 గంటల సమయంలో గోపన్‌పల్లిలోని యాక్సిస్ బ్యాంక్ ఏటీఎంలో క్యాష్ లోడ్ చేసేందుకు ఇద్దరు కస్టోడియన్లు లోపలికి వెళ్లగా గార్డు వాష్‌రూమ్‌కు వెళ్లాడు. ఇదే అదునుగా భావించిన డ్రైవర్ అజిత్‌కుమార్ వాహనంతో పరారయ్యాడు. ఏటీఎం నుంచి బయటకు వచ్చిన కస్టోడియన్లకు వాహనం కనిపించకపోవడంతో డ్రైవర్‌కు ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ చేసి ఉంది. చుట్టుపక్కల గాలించినా ప్రయోజనం లేకపోవడంతో డయల్ 100కు కాల్ చేసి సమాచారం అందించారు. దీంతో రంగంలోకి దిగిన గచ్చిబౌలి పోలీసులు జీపీ ఎస్ ట్రాకింగ్ ద్వారా వాహన జాడను జల్లెడపట్టగా తెల్లాపూర్ వైపు వెళ్లినట్లు తేలింది.

# మూసీ పునర్జీవనానికి పడిన అడుగు



**హైదరాబాద్ న్యూస్ తరంగాలు:**
హైదరాబాద్ :ఉమ్మడి రాష్ట్రంలో నిర్లక్ష్యానికి గురైన మూసీనది, తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడి 12 ఏళ్లకు చేరువవుతున్నప్పటికీ మురికి కాలువగానే ప్రవహిస్తూ హైదరాబాద్ నగర అభివృద్ధికి ఆటంకంగా మారింది. నదీ పరీవాహక ప్రాంతం కబ్జాలకు గురవడం, పారిశ్రామిక వ్యర్థాలతో నిండిపోవడంతో కాలుష్యం పెరిగి నగర ప్రజల ఆరోగ్యానికి పెనుముప్పును మోసుకొచ్చింది. ఎప్పటికప్పుడు మూసీ ప్రక్షాళనకు ప్రణాళికలు సిద్ధం చేసినప్పటికీ కాగితాలకు పరిమితమవుతున్నాయి. కెసిఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో రెవెన్యూ యంత్రాంగం, మూసీ రివర్ అథారిటీ సంయుక్తంగా నదీ తీర ప్రాంతాల్లోని ప్రభుత్వ స్థలాలపై దృష్టి సారించింది. సుమారు 8,529 ఆక్రమిత స్థలాలు ఉన్నట్లు గుర్తించింది. నది పారుతున్న ఎనిమిది మండలాల పరిధిలో వాస్తవ పరిస్థితిపై పూర్తిస్థాయిలో అధ్యయనం చేసింది. నది పొడవు, వెడల్పు, ఆక్రమణల ఫోటోలు, వీడియోగ్రాఫ్‌లతో పాటు కేటగిరిల వారీగా వివరాలను సేకరించింది. గుజరాత్‌లోని సబర్మతి నదిని స్ఫూర్తిగా తీసుకుని 'మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్' ను 12 జూన్ 2017న ఏర్పాటు చేశారు. ప్రక్షాళన కోసం రూ. 1200 కోట్లు, తీర ప్రాంత అభివృద్ధి, సుందరీకరణకు రూ. 3 వేల కోట్లతో ప్రణాళికను రూపొందించడం జరిగింది.

# టిడిపి పార్టీ స్థలం ఆక్రమణ కు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగిన టిడిపి శ్రేణులు



**ఖమ్మం, తరంగాలు:**
ఖమ్మం నగరం లోని 2వ డివిజన్ (పాండురంగ పురం) వద్ద 1999 సంవత్సరంలో తెలుగుదేశంపార్టీ ప్రభుత్వం హయాంలో 150 ఎకరాలకు ఇండ్లు లేనివారికి ఇండ్ల స్థలాలు ఆనాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సీఎం చంద్రబాబు, ఆదేశాలతో క్వార్టర్స్ పంచి ఇచ్చారు, అదే క్రమంలో పార్టీ కార్యాలయానికి 85 గజాల స్థలం అప్పటి ఖమ్మం వీ=ా కేటాయించారు, జిల్లా నాయకులు స్థానిక నాయకులు ఆ స్థలంలో టీడీపీ దిమ్మె కట్టించి జెండా ఎగరవేశారు, అప్పటి నుంచి పార్టీ అధీనంలో ఉన్న స్థలం కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు దొంగ పట్టా సృష్టించి పార్టీ స్థలాన్ని ఆక్రమించి నిర్మాణం చేయాలని ప్రయత్నించగా స్థానికులు వారితో వాగ్వాదానికి దిగి టిడిపి పార్టీ కార్యాలయానికి తెలియజేశారు, విషయం తెలుసుకున్న వెంటనే జిల్లా నాయకులు కేతినేని హరీష్ చంద్ర, గుత్తా సీతయ్య, వాసిరెడ్డి భాస్కరరావు, వనమా వాసు, వడ్డేం విజయ్, హుటా హుటిన కబ్జా కాబడిన స్థలం వద్దకు చేరుకొని నిరసన తెలియజేసి జెసిబి ద్వారా స్థలాన్ని శుభ్రపరిచి పార్టీ జెండా పాతి స్థలం స్వాధీనపరచుకోవడం జరిగింది, ఈ కార్యక్రమంలో 2వ డివిజన్ అధ్యక్ష కార్యదర్శి కృష్ణమాచారి, యల్లంకి నరసింహారావు, పోట్ల నాగేశ్వరావు, మందడపు సుధాకర్, మహిళ నాయకురాలు వేగినాటి ఉమ, తాడిశెట్టి స్వాతి, అనితా,మంగమ్మ, పావని,లావణ్య, ఝాన్సీ, నాయకులు చంద్ర రవి, పెనుగొండ ఉపేందర్, గుండెపిన్నీ నాగేశ్వరరావు, కన్నెటి పృధ్వీ, తదితరులు పాల్గొన్నారు.

# బహుముఖ ప్రజ్ఞాశాలి డాక్టర్ చిన్న లక్ష్మీ కళావతి .



**ప్రొద్దుటూరు, తరంగాలు:**
స్థానిక శ్రీరాముల పేట వీధిలోని ఉపాధ్యాయ సేవా కేంద్రంలో ఫిబ్రవరి 13 వ తేదీన జాతీయ మహిళా దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ చిన్న లక్ష్మీ కళావతి ని సన్మానించడం జరిగింది. డాక్టర్ చిన్న లక్ష్మీ కళావతి ఎం. ఏ., పి. హెచ్.డి చేసి గుంటూరు ఏ.సి. కళాశాలలో తెలుగు అధ్యాపకురాలిగా పనిచేశారు.అలాగే కవితలు , కథలు , పాటలు, వ్యాసాలు వంటి అన్ని ప్రక్రియలలో కవయిత్రి గా, రచయిత్రి గా పేరు పొంది దాదాపు 12 పుస్తకాలను రచించారు.అలాగే 10 టీ.వీ లో గేయ రచయిత్రి గా పరిచయం అయ్యారు.నాగార్జున విశ్వ విద్యాలయం లో పి. హెచ్.డి లు ఎంతో మందితో పూర్తి చేయించారు. ప్రొద్దుటూరు లోని వేమన సాహితీ కళాపీఠం నందు అనేక సభలను నిర్వహించారు. నవ్యాంధ్ర రాష్ట్ర రచయితల సంఘానికి అధ్యక్షురాలిగా బాధ్యతలు నిర్వహించారు. ప్రొద్దుటూరులో శతాధిక కవి సమ్మేళనం నిర్వహించి వండర్ బుక్ ఆఫ్ రికార్డు ను కూడా అందుకున్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఒంటేరు శ్రీనివాసుల రెడ్డి , ఎన్ టి ఆర్ వైద్య విశ్వ విద్యాలయం పాలక మండలి సభ్యులు డాక్టర్ టి డి వరుణ్ కుమార్ రెడ్డి, తోట వెంకట శైలజ,మాధవి,సంస్కృత అధ్యాపకులు రమణ, కిషోర్, షేక్షా వల్లి, చిరంజీవి, చరణ్ పాల్గొనడం జరిగింది.

**కాకినాడ జిల్లా :తుని తరంగాలు:**



తపోవనం ఆశ్రమ పీఠాధిపతి సచ్చిదానంద సరస్వతీ స్వామీజీ కన్నుమూత. తెల్లవారుజామున ఆశ్రమంలో గుండెపోటుతో స్వామీజీ శివైక్యం. గత కొంతకాలంగా స్వామీజీ అనారోగ్యంతో బాధపడుతున్నారు రెండురోజుల క్రితమే ఆసుపత్రి నుంచి ఆశ్రమానికి వచ్చిన స్వామీజీ. ఇవాళ తెల్లవారుజామున గుండెపోటుతో కన్నుమూశారు. సచ్చిదానంద స్వామీజీ శృంగేరి పీఠాధిపతి భారతి తీర్థ మహాస్వామి శిష్యరికం చేశారు

# ఘనంగా సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలు

















**వర్ధన్నపేట ప్రతినిధి, ఫిబ్రవరి 15,తరంగాలు:** బంజారా సమాజ చరిత్రలో సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ పేరు అక్షరాలా ఆరాధ్యంగా నిలిచింది. ఆధ్యాత్మిక మార్గదర్శిగా, ధర్మబోధకుడిగా, సమాజ సంస్కర్తగా ఆయన చూపిన దారి నేటికీ బంజారా సమాజానికి దిక్సూచి. సేవ, సత్యం, సమానత్వం, సామాజిక న్యాయం అనే విలువలను బోధిస్తూ సమాజాన్ని ఐక్యత వైపు నడిపించిన మహనీయుడు సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలు వర్ధన్నపేట మండలం చంద్రు తండా గ్రామంలో ఘనంగా నిర్వహించారు. చంద్రుతండా గ్రామ సర్పంచ్ భూక్య నీలా రవి నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గోరు సిక్వాడి వచ్చారి దళ్ రాష్ట్ర ప్రముఖ్ కేపీ నాయక్ హాజరయ్యారు. ముందుగా సేవాలాల్ మహారాజ్ జయంతి సందర్భంగా భారీ బైక్ ర్యాలీ నిర్వహించి అనంతరం చంద్రు తండ గ్రామపంచాయతీ ప్రాంగణం వద్ద మహా భోగ్ బండర్ కార్యక్రమం నిర్వహించి, సంత్ సేవాలాల్ మహారాజ్ చిత్రపటానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేపీ నాయక్ మాట్లాడుతూ బంజారాలలో జ్ఞానజ్యోతిని వెలిగించిన గొప్ప ఆధ్యాత్మిక గురువు, ఆరాధ్యదైవం సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ అని అన్నారు. ప్రజల మేలు కోసం అనేక ఉద్యమాలు చేశారని గుర్తు చేశారు. బంజారాల సంస్కృతికి ఆధ్యాత్మికతను జోడిస్తూ, దేశమంతా సంచరిస్తూ, హితబోధ చేశారన్నారు. దేశమంతా ఛిన్నాభిన్నంగా ఉన్న బంజారా సమాజాన్ని సేవాలాల్ ఏకం చేశారన్నారు. బంజారా జాతి ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటేలా అహింసా సిద్ధాంతానికి పునాదులు వేసిన మహనీయుడని కొనియాడారు. సేవాలాల్ మహారాజ్ జీవితం ఒక ఆధ్యాత్మిక ప్రయాణం మాత్రమే కాదు, ఒక సామాజిక ఉద్యమం కూడా. బంజారా సమాజంలో వ్యాప్తి చెందిన అజ్ఞానం, మూఢనమ్మకాలు, విభేదాలను తొలగించి సమగ్రతను నెలకొల్పేందుకు ఆయన కృషి చేశారని అన్నారు. సమాజంలో ప్రతి వ్యక్తి సమానమని, కుల, వర్గ భేదాలు లేకుండా అందరూ ఐక్యంగా జీవించాలనే సందేశాన్ని ఇచ్చారన్నారు. ఆయన బోధనలు సత్యం, ధర్మం, సేవ భావాలపై నిలిచాయి. సేవ చేయడం ద్వారానే జీవితం సార్థకం అవుతుందని ఆయన చెప్పేవారు. సమాజానికి మేలు చేసే పనులే నిజమైన ఆరాధన అని ఉపదేశించారు. బంజారా యువతలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించి, ఐక్యతతో ముందుకు సాగాలని ప్రేరేపించారు. ఆయన చూపిన మార్గం సమాజానికి నైతిక బలం ఇచ్చింది. సేవాలాల్ మహారాజ్ కేవలం ఆధ్యాత్మిక నాయకుడే కాదు. సామాజిక న్యాయానికి కట్టుబడి ఉన్న సంస్కర్త. మహిళలకు గౌరవం, సమాజంలో పరస్పర సహకారం, ధర్మబద్ధమైన జీవనం వంటి అంశాలను ప్రోత్సహించారు. సమాజంలో సమానత్వాన్ని నెలకొల్పడంలో ఆయన ఆలోచనలు కీలక పాత్ర పోషించాయి. సేవాలాల్ మహారాజ్ జీవితం నేటి తరాలకు ఒక స్ఫూర్తి. విభేదాల కంటే ఐక్యత గొప్పదని, అహంకారం కంటే వినయం మేలని, స్వార్థం కంటే సేవ శ్రేష్ఠమని ఆయన చూపించారు. సమాజం బలపడాలంటే పరస్పర గౌరవం అవసరమని ఆయన బోధించారు. మొత్తంగా సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ జయంతి కేవలం ఒక ఆచరణాత్మక వేడుక కాదు. అది విలువలను గుర్తు చేసే రోజు. సేవ, సత్యం, సమానత్వం, సామాజిక న్యాయం అనే సిద్ధాంతాలను ఆచరణలో పెట్టే సంకల్ప దినం. బంజారా సమాజాన్ని ఐక్యత వైపు నడిపించిన మహనీయుడిగా సేవాలాల్ మహారాజ్ పేరు చిరస్థాయిగా నిలుస్తుందన్నారు.

దేశంలో ఉన్న కోట్లాదిమంది గిరిజనులకు సేవాలాల్ మార్గదర్శి, ఆదర్శప్రాయుడని, ఆయన చూపిన బాటలో అందరూ నడవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో చంద్రుతండా గ్రామ సర్పంచ్ భూక్యా నీలా - రవినాయక్, ఉపసర్పంచ్ భూక్యా బుజ్జి - భద్రునాయక్, వార్డుమెంబర్లు, దేశ్య , వెంకన్న,వెంకటేష్, రాజు, నెహ్రూ, స్వామి, రాజేందర్ రాథోడ్, తండా నాయకులు,రామచంద్రు, వెంకన్న, శ్రీరాములు,రవి, రాజు, బోజ్యా, గోర్సేన నాయకులు, చిట్టిబాబు, కృష్ణ, మధు, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు...

## కరీంనగర్ కార్పొరేషన్‌లో బీజేపీకి మెజారిటీ లేదు

**- మంత్రి పొన్నం ప్రభాకర్**
**- నిజామాబాద్ మాదిరిగానే ఇక్కడ కూడా స్పష్టమైన ఆధిక్యం లేదని వ్యాఖ్య**
**- డెమోక్రటిక్ విధానంలోనే మేయర్ ఎన్నిక జరగాలని స్పష్టం**



**కరీంనగర్, ఫిబ్రవరి 15 (తరంగాలు ప్రతినిధి):** కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో బీజేపీకి స్పష్టమైన మెజారిటీ లేదని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో మొత్తం 60 సీట్లలో బీజేపీకి 28 సీట్లు మాత్రమే వచ్చాయని, అక్కడ పార్లమెంట్ సభ్యుడు మెజారిటీ లేదని ప్రకటించి ప్రతిపక్షంలో కూర్చుంటామని చెప్పారని గుర్తుచేశారు. కాంగ్రెస్‌తో పాటు ఇతర పార్టీలు మిగతా సీట్లు గెలుచుకున్నాయని, అక్కడి పరిస్థితి ఎలా మారుతుందో భవిష్యత్ నిర్ణయిస్తుందని అన్నారు. కరీంనగర్ కార్పొరేషన్‌లో మొత్తం 69 సభ్యులు ఉన్నారని, అందులో బీజేపీకి 30 మంది మాత్రమే ఉన్నారని వివరించారు. అయినప్పటికీ మేయర్ అవుతామని బండి సంజయ్ ప్రకటించడం రాజకీయంగా సమంజసం కాదని వ్యాఖ్యానించారు. గతంలో తమ పార్టీ 13 సీట్లు గెలిచినప్పటికీ కరీంనగర్‌లో మేయర్ పదవిని సాధించామని గుర్తుచేశారు. ఇప్పుడు కూడా అన్ని రాజకీయ పార్టీలు రాష్ట్ర ప్రభుత్వ సలహా సూచనల మేరకు వ్యవహరిస్తాయని, ముఖ్యమంత్రి లేదా మంత్రుల జోక్యం లేదని స్పష్టం చేశారు. స్థానికంగా గెలిచిన ప్రజా ప్రతినిధులే తమ ఆలోచనలకు అనుగుణంగా నిర్ణయం తీసుకుంటారని మంత్రి తెలిపారు. నిజామాబాద్‌లో మెజారిటీ లేకపోతే ఎలా ప్రతిపక్షంలో కూర్చోవాలనుకుంటే, కరీంనగర్‌లో కూడా అదే విధంగా వ్యవహరించాలని సూచించారు. డెమోక్రటిక్ పద్ధతిలో గెలిచిన కార్పొరేటర్లు మేయర్‌ను ఎన్నుకుంటారని, ముఖ్యమంత్రి లేదా మంత్రులు ప్రజా ప్రతినిధులను ప్రభావితం చేస్తారని చెప్పడం సరైంది కాదన్నారు. ప్రజాస్వామ్యంలో తాము ఎవరికి వ్యతిరేకం కాదని, బీజేపీ గెలిచిన 30 మందికీ, మిగతా 36 మందికీ శుభాకాంక్షలు తెలిపారు. కరీంనగర్ లాంటి మూడు లక్షల ఓటర్లున్న, తెలంగాణలోనే అత్యధిక డివిజన్లు కలిగిన కార్పొరేషన్ అభివృద్ధి కోసం మంచి పాలకవర్గం అవసరమని మంత్రి అభిప్రాయపడ్డారు. మెజారిటీ ఉంటే అడ్డుపడబోమని, ఎవరికీ వ్యతిరేకంగా వ్యవహరించబోమని స్పష్టం చేశారు. రాజకీయ లబ్ధి కోసమే కాకుండా అభివృద్ధి దిశగా సహకరిస్తామని, 16వ తేదీన ఏమవుతుందో చూడాలని పేర్కొన్నారు. ఎన్నికల తర్వాత ఇతర చోట్ల క్యాంపులు జరిగినా, ప్రస్తుతం కొత్తగా క్యాంపులు ఏర్పాటు చేయలేదని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.

## పానగల్ సోమేశ్వరాలయాల్లో మంత్రి కోమటిరెడ్డి ప్రత్యేక పూజలు

**- మహాశివరాత్రి సందర్భంగా పట్టు వస్త్రాల సమర్పణ**
**- చారిత్రాత్మక ఆలయాల వైభవంపై మంత్రి వ్యాఖ్యలు**
**- యునెస్కో గుర్తింపుకు కృషి చేస్తామని హామీ**







**నల్లగొండ, ఫిబ్రవరి 15 (తరంగాలు ప్రతినిధి):** మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా నల్లగొండ పట్టణంలోని చారిత్రాత్మక పానగల్ పచ్చల సోమేశ్వరాలయం, ఛాయా సోమేశ్వరాలయం దేవాలయాల్లో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించి ఆశీస్సులు తీసుకున్నారు. వందల ఏళ్ల చరిత్రను సాక్షిగా నిలబెట్టుకున్న ఈ ప్రాచీన ఆలయాలు తెలంగాణ సంస్కృతి, శిల్పకళ వైభవానికి ప్రతీకలని మంత్రి పేర్కొన్నారు. 11--12వ శతాబ్దాలకు చెందిన ఈ దేవాలయాల్లో అద్భుతమైన శిల్ప సంపద ఉట్టిపడుతుందని తెలిపారు. ముఖ్యంగా ఛాయా సోమేశ్వరాలయం గర్భగుడిలో ఎల్లప్పుడూ ఒకే విధంగా కనిపించే నీడ విశేష ఆకర్షణగా నిలుస్తోందని చెప్పారు. ఈ ఆలయాలను పర్యాటకంగా మరింత అభివృద్ధి చేయడానికి కృషి చేస్తానని మంత్రి వెల్లడించారు. యునెస్కో గుర్తింపు వచ్చేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరనున్నట్లు తెలిపారు. పర్యాటక అభివృద్ధితో స్థానిక ఆర్థిక వ్యవస్థకు ఊతమిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మహాశివరాత్రి సందర్భంగా ఆలయాల్లో భక్తుల రద్దీ కనిపించింది. శాంతి, భక్తి భావాలతో పండుగను జరుపుకోవాలని మంత్రి కోరుతూ హర హర మహాదేవ అంటూ తన సందేశాన్ని ముగించారు.

# కవి పండిత బాలకుడు

తెలుగులో రాసేవాళ్ళతో, చదివేవాళ్ళతో సంభాషణ కోసం ఉవ్విళ్ళూరేవారు వేలూరి వెంకటేశ్వరరావు గారు. అలా కవులు కూచుని హస్కు కొట్టుకోడాన్ని ఆయన ్వ---్వ అనేవారు. 1992లో ఒక వేసంగి. అట్లాంటాలోన పెమ్మరాజు వేణు గోపాలరావుగారు ఇంట్లో ఒక్కళ్ళే ఉన్నారు. నన్ను "ఏంవండీ రండి... వేలూర్ని కేకేస్తాను! రండి!!" అని పిలిచేరు. వాళ్ళిద్దరూ అలా కేకేస్తే నేను లొట్టలేసుకుంటూ చాల దూరం డ్రైవ్ చేసుకుని వెళ్ళేను. కెరొలీనా, జార్జియా పీచ్ పళ్ళ దుకాణాలు, +ఖంశీశ్రీఅఅవ 1వి అనే హోర్డింగ్‌లు దాటుకుంటూ. వేణుగోపాలరావు గారింట్లో పెరడు, నడవాలు బొమ్మరిళ్ళలా కళాత్మకంగా తీర్చిదిద్దుకున్నారు. ఆయన అప్పట్లో కవులందరివీ ఒక్కో కవిత తీసుకుని సంకలనంగా వేసేరు-- మచ్చు తునకలు అని కాబోలు. ఆ పుస్తకం బల్ల మీద పెట్టుకుని వేలూరి గారు భోజనాల బల్ల మీద్వ-- -్వకి సిద్ధంగా కూర్చున్నారు. ఆయన సైన్సుదీ చాల చదువుకున్నారు, కాని ఆయనకి నిజంగా ఇష్టమైన శాస్త్రం సామాన్య శాస్త్రం కాదు, సాహిత్య శాస్త్రం. అరవైలనాటి ఆంధ్ర యూనివర్శిటీ, అబ్బూరి, తిలక్, శ్రీశ్రీ ఇవన్నీ ఆపకుండా మాట్లాడుతూనే ఉన్నారు. ఆ రోజు భోంచేస్తూ "అన్నం తినేటప్పుడు ఏ సమయంలో 'ఇంక చాలు!' అనుకుని లేవాలో అది... అది చాల కష్టం!" అని చెప్పేరు. ఆయనకి నిజంగా ఇష్టమైన భోజనం, 'ఇంక చాలు!' అని ఎలా ఎప్పుడనుకోవాలో తెలీకుండా భోంచేసే విందు సాహిత్యం. అంటే కాయితాల మీద పేజీల్లో, ఒకర్నొకరు కేకేసుకునీ లలోనూ ఆబగా జుర్రుకునేది. అప్పటికింకా ఇంటర్నెట్, వెబ్ అని ఏంవీ లేవు. ఇంట్లో వేణుగోపాలరావుగారు ఒక్కరే ఉన్నారు. చెస్ లాంటి ఆటలు ఆడేవాళ్ళు, పేకాడేవాళ్ళు, చిన్నపిల్లలూ ఇంటికెవరొచ్చినా "రా! ఒకెత్తు వేద్దాం?!" అని సతాయిస్తారు కదా. వేలూరి వ్యవహారం అంతా అలాగే ఉండేది "రండి! కవిత్వం గురించీ, రైటర్స్ గురించీ మాట్లాడుకుందాం!" అని కవ్విస్తున్నట్టు, కాలు దువ్వుతున్నట్టూ. కవి తిలక్ గురించి చాలా చెప్పేరు. తిలక్ అంటే పారవశ్యంలా ఉండేది నాకు. అవన్నీ అడిగడిగి, నోరెళ్ళబెట్టుకుని విన్నాను. ఆయన ఎవర్నీ ఊరకే ఉండనిచ్చేవారు కాదు. సంభాషణ ఏ మాత్రం ఆగినా "ఊఁ ఇంకేంటండీ చెప్పండి..?" అని చర్చని ఎగసనదోసేవారు. అది వివాదం అయితే ఆయనకి మరింత ప్రీతి. పేరుమోసినవాళ్ళు, రకరకాల బులుపులు, ప్రలోభాలున్న మనుషుల్ని గురించి నిక్కచ్చిగా ఎత్తిపొడుస్తూ నవ్వించేవారు. అలాగే ఆయన గౌరవించే మనుషులు, వాళ్ళ వ్యాసంగాల గురించి విశేషంగా పొగుడుతూ చెప్పేవారు. సంభాషణ అంటే వాదం, ప్రతివాదమున్నూ. అటుంచి ఆయన ఒక బాణం వేస్తే, ఇట్నుంచి మనం ఒక ప్రతిబాణం వెయ్యాలి. చర్చ ఇలా "రగడ రగడ రగడం! కానీరా జగడ జగడ జగడం!!" లాగ రంజుగా రాజుకోవాలి. కాఫీలవీ రప్పిస్తూ, పదిమందిమీ నవ్వు మొహాలు పెట్టుకుని వింటూ, అంటూ తింటూ వినోదిస్తూ, సాహితీ ప్రపంచపు మనుషులు, పుస్తకాల నిజాల నిగ్గుతేల్చటం ఇది ఆయనకి ప్రియమైన విందు భోజనం. సైంటిస్ట్, మార్క్సిస్ట్, ఎన్నారై సాహితీ దిగ్గజం ఇలాంటి గుర్తింపులు ఎన్నున్నా ఆయన మౌలికంగా ఇలా అమర్త్య సేన్ గారు చెప్పినలాంటి ఫక్తు రసవాది, ఇంకా ప్రతివాది భయంకరుడు ఆ తరవాత 1998లోనేమో, టెక్సస్ లోనో ఎక్కడో తెలుగు సభల్లో ఆయనతో, నారాయణరావు గారితో కలిసి నడుస్తూ భోజనాల కోసం వెతుక్కున్నామని గుర్తొస్తోంది. ఆయనలో సాహిత్య కాంక్ష ఇంత ప్రబలంగా ఎందుకు వేళ్ళూనుకుందో అర్థం చేసుకోవాలంటే ఆయనకు చిన్నతాతగారైన వేలూరి శివరామ శాస్త్రి గారి చరిత్రని, ఆయన కుటుంబ నేపథ్యాన్నీ చదువుకుంటే బోధపడుతుందేమో. శివరామ శాస్త్రి గారు గొప్ప కవి, మహా పండితుడు. కవులకీ కవులకీ వాగ్యుద్ధాలు జరిగే సత్తెకాలపు రోజుల్లో ఆయన తమ గురువులు తిరుపతి వేంకట కవుల తరపున ఎగస్పార్టీ (కొప్పరపు) కవుల మీద 'బస్తీ మే సవాల్!' లాంటి కవిత్వ బాణాలు ప్రయోగించి రంగ ప్రవేశం చేసేరనీ, విస్తృతంగా శతావధానాలు చేసేరనీ చరిత్ర. వస్తుతః సాధువు, పరమ కారుణ్యమూర్తి అయిన శివరామశాస్త్రి గారినే రెచ్చగొట్టగలిగిన ఇలాంటి రసకందాయమైన సాహిత్య వాతావరణం, కుటుంబ నేపథ్యాల ప్రభావం ఒకవైపు, ఈ పాత వాగ్వైభవాల వాసనల్ని, పద్ధతుల్నీ చాదస్తమని గ్రహించుకుని, తమ సాంస్కృతిక వారసత్వం సమస్తాన్నీ 'బ్రాహ్మినిజం' అని తిరస్కరించి, అవమానిస్తూ వచ్చిన కొత్త కాలపు శాస్త్రీయ దృక్పథం, సామ్యవాదం, ఆధునిక విద్యల ప్రభావం ఇంకొకవైపు వేంకటేశ్వర రావు గారిని చెరొకవైపూ లాగుతూ ప్రభావితం చేసి ఉంటాయి. ఈ పెనుగులాటలో మార్క్సే గెలిచాడు. వ్యక్తిత్వం అంటే మనం పెరిగి పెద్దయ్యేక కావల్సినవి నాలుగూ ఎంచుకొని బాహ్యంగా ప్రకటించుకోగలిగినది మాత్రమే కాదు. బాల్యం నుండి మనకంటూ ఏ వ్యక్తిత్వమూ ఇంకా ఏర్పడని రోజుల్లో మన అనుభవాలు, విన్నవి చూసినవీ అనుభవించినవీ ఇవన్నీ మన వ్యక్తిత్వాల్ని, ప్రవర్తననూ విశేషంగా, తప్పనిసరిగా ప్రభావితం చేస్తాయి. కృష్ణ కర్ణామృతం లోని శ్లోకం ఒకటి. యశోద చిన్ని కృష్ణుణ్ణి జోకొడుతూ రామకథ చెప్తుంది: "రామో నామ బభూవ, హుం, తదబలా సీతేతి, హుం" అని మొదలౌతుంది. ఆ కథ వింటూ ఊ కొడుతూ నిద్రపోతున్న వాడల్లా కృష్ణుడు-- సీతాపహరణం, రావణుడి ప్రసక్తి వచ్చే సరికి ఉలిక్కిపడి దిగ్గున లేచి 'లక్ష్మణా! నా విల్లెక్కడ? ఏదీ, ఏదీ తే?!' అని లేస్తాడు. లీలాశుకుడు నాలుగే పాదాల్లో ఇంత కథనూ చిత్రించిన పద్ధతి చాల మనోహరంగా ఉంటుంది. ఈ శ్లోకమంటే వేలూరి చెవి కోసుకునేవారు, ఇష్టంగా వర్ణించేవారు. 2010లో అనుకుంటాను. అట్లాంటాలో వాళ్ళింటికెళ్ళేను. ఏమీ మాట్లాడలేననీ పాట పాడతానని అనంటే సరే పాడండి అన్నారు. ప్రయాగ రంగదాసు కృతి రామ రామయనరాదా అనుంది, అది పాడేను. నవ్వుకుని ఉంటారు, 'ఇలా దేవుడి పాటలా పాడుకుంటున్నాడు!' అని. నాతో ఏమీ అనలేదు. తను పెంచుకుంటున్న మిరప మొక్కల్ని చూపించేరు. ఆయన, శాంతి గారు నేను వెళ్తుంటే మళ్ళీ రావాలి నాల్రోజులుండాలి అని పదే పదే చెప్పేరు. 2012లోన వాళ్ళిద్దరూ హైదరాబాద్ వచ్చేరు. వాళ్ళిల్లు ఒక కొసన, మేము ఇంకో కొసన. నేనే వెళ్ళి తీసుకొచ్చేను. నా గాండీవం అప్పటికే విరిగిపోయి చాన్నాళ్ళయ్యింది. ఆయన వాగ్ప్రవాహానికి నేను ఊఁ కొడుతున్నాను, హుం, హుం అని. మధ్య మధ్యలో మా పనమ్మాయి ఎలా వండుతోందోనని ఓ చూపు చూసుకుంటూ. తను ఆ కూర ఎలా చెయ్యాలో తెలీక నన్నడుగుతుంటే నేను ఎలా చెయ్యాలో చూపించొచ్చి కూర్చుని మళ్ళీ ఊఁ కొడుతుంటే ఆయన కళ్ళు మెరుస్తూ, ఒళ్ళంతా కదుల్తూ చాల నవ్వేరు. శాంతిగారికి తలనొప్పి ఆరోజంతా. నేను మాత్తర్లు తెచ్చిచ్చేను. ఆ తరవాత ఊరు చూట్టానికెళ్ళేము. యూనివర్శిటీ అంతా తిప్పుతూ ఇక్కడ మీరు పాఠాలు చెప్పొచ్చు అనంటే ఆయన అన్యమనస్కంగా 'ఆఁ చూద్దాం లెండి!' అన్నారు. ఆయనకి ఫిజిక్స్ మీద లేదు. కవిత్వం, కథల మీదనే ఉన్నాది. నేనేం అడగకుండానే ఆయనే తనలో తనే మాట్లాడుకుంటున్నట్టు "నా శక్తి కొద్దీ రాసినా, ఎంతగా ప్రయత్నం చేసినా, ఇంకా చాలదూ అది కాదూ అంటే... అని అన్నారు. నేనేమీ అనకుండానే ఆయన ఎందుకలా చెప్పుకున్నారా అనుకున్నాను. అది లోలోతుల్లోని ధనుర్ధారి తనమీద తనే ఎక్కుపెట్టుకున్న బాణం. మార్క్సిజం, పరమాణు భౌతిక శాస్త్రం, సాహితీ సమాజం, ప్రవాస జీవితపు దుఃఖం, ఎన్నారై పెద్దరికం, మనందరికీ తప్పనిసరైన సాంఘిక మర్యాదా ఇన్ని బరువు దొంతర్ల కింద నలుగుతున్న కవి పండిత బాలకుని అభినివేశపు ఆక్రందన, జన్మాంతర సౌహృద. ఏ లోపలి నూతుల్లోంచో ఏకాంతంలో ప్రతిధ్వనిస్తున్నట్లు. ప్రతిగా ఏ కేకా వెయ్యలేక నిస్సహాయంగా ఉండిపోయేను. "సరే బై అండీ! వెళ్ళొస్తాం నమస్తే అండీ!!" అనే శలవు తీసుకున్నాను. ఆయన చాల చమత్కారంగా మాట్లాడేవారు. మాటకారితనంతో మెత్తగా చురకలు పెట్టేవారు. సాహిత్యం గురించి, రాసి చదివే మనుషులు, పుస్తకాల్ని గురించిన ఆసక్తి, ఆపేక్ష ఆయనకు చివరివరకూ ఏమాత్రం వన్నెతగ్గకుండా ప్రకాశిస్తూనే వచ్చేయి. నాకు ఆ ఆసక్తి, ఆపేక్ష క్రమంగా క్షీణిస్తూ వచ్చి, చివరికి పదాలు, వాక్యాలు చెప్పే ఏ కథా, ఏ అనుభూతీ, ఎలాంటి సత్యమూ అక్కర్లేదు, ఒద్దుగాక ఒద్దని కొడిగట్టిపోయింది. ఇది ఆయన్ని నొప్పించింది అనుకుంటాను. చాల రకాలుగా 'కేకేస్తూ', కబుర్లు పెడుతూ, కవ్విస్తూ వచ్చేరు. పడుకున్నాడో పోయేడో తెలీని కవిని తట్టి లేపి, ఉత్సాహపరచే ప్రయత్నం చాల చేసేరు. కాని నేను ప్రతిగా ఏమీ అనలేకుండా గమ్మునుండిపోయేను. ఇది ఆయన్నేకాదు, నేను స్నేహితుణ్ణని అనుకున్న మంచి మనుషులెందర్నో నిరాశ పరుస్తూనే వచ్చింది. నేను ఇంక నిండా ములిగినవాడికి చల్లంవిటన్నట్టు ఊరుకున్నాను. 2019 ప్రాంతాల్లోన తన కవితల పుస్తకం 'అవ్యయ' కాపీ పంపించేరు. నేనేమీ అనలేకపోతే మళ్ళీ ఇంకొకటి పంపించేరు. ఏదైనా అనవయ్యా?! అని కవ్వించటం కాదు, బతిమాలుతున్నట్టే. కేలిఫోర్నియా వచ్చి చుక్కా శ్రీనివాస్ దగ్గర నా నెంబర్ తీసుకుని ఫోన్ చేసేరు. "ఊఁ..ఏంటండీ?" అని. గొంతులో ఇది వరకటి అల్లరి లేదు. రిటైరైన తర్వాత పెన్షనర్ని అని, చాలు, హాయిగా... అనీ ఇలాగ. రమ్మనమన్నారు. నేను వెళ్ళి దొంగ నమస్కారాలు పెట్టినా ఆయనకీ, ఎవరికీ ఏ ప్రయోజనమూ లేదని గమ్మునే ఉండిపోయేను. ఆయనకి చాన్నాళ్ళుగా ఆశ్చర్యం, అపనమ్మకంలా ఉండేది అనుకుంటాను. 'ఏదో ఒకటీ రాసి, చేసీ చూపించవయ్యా! ఈ పలవరింతలేంటి?' అని. అన్నట్టూ. టచ్చిలో ఉండమని మా అమ్మే నన్నడగటం మానుకుంది. టచ్ మీ నాట్ కూడా ఒక మొక్కే కదా! ఊరికే మూసుకునుండటం అమర్యాద కాదు అని, అది ఒక్కళ్ళం మనతో మనమే ఆడుకునే లాంటిదనీ ఆయనకి మాటల్లో ఎలా చెప్పటం? మౌనం భగవాన్ పదస్పర్శ. నిరంతరాయంగా నెత్తి మీదనే పెట్టుకుని పడుంటే అది ప్రేమకు, గౌరవానికీ, సృజనకూ పరాకాష్ఠ. భాష వలన కలిగే దుఃఖాన్ని కడిగే శాంతి అది అని వేలూరికి ఇప్పుడింక ఎలాగ?

## అన్యమతస్థులతో అన్యోన్య బంధం

భిన్న మతాలకు చెందినవారు శాంతి సామరస్యాలతో కలసికట్టుగా జీవించేలా చేయడమెలా? ఇది, ఆధునిక ప్రపంచం ఎదుర్కొంటున్న మహా సవాళ్లలో ప్రధానమైనది. మత సంబంధమైన అధిక సంఖ్యాక వాదం ప్రాతిపదికన పశ్చిమాసియా, దక్షిణాసియాలలో జాతి--రాజ్యాల ఏర్పాటు, ఐరోపా, ఉత్తర అమెరికా దేశాలకు క్రైస్తవేతరుల వలసలు తీవ్ర కలహాలు, తరచు హింసాత్మక ఘర్షణలకు కారణమయ్యాయి. దురహంకారం, ఆధిక్యతా భావన పదే పదే సహనం, పరస్పర అవగాహనపై విజయం సాధిస్తున్నాయి. భిన్న మతాల మధ్య మరింత అవగాహనను పెంపొందించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని అమెరికా విద్వజ్జుడు థామస్ ఆల్బర్ట్ హోవార్డ్ తన పుస్తకం లో ప్రేరణాత్మకంగా స్పష్టపరిచారు. హోవార్డ్ పుస్తకం ప్రధానంగా క్రైస్తవంపై దృష్టిని కేంద్రీకరించింది. క్రైస్తవ ధర్మశాస్త్రజ్ఞులు ఒకప్పుడు తమ మతమే నిజమైన మతమని సునిశ్చితంగా విశ్వసించేవారు. ఆ విషయమై గట్టిగా వాదించేవారు. ఇరవయో శతాబ్దంలో ఈ ధోరణి క్రమంగా మారింది. ఆధ్యాత్మిక అహంకారానికి పేరుబడిన రోమన్ కేథలిక్ చర్చ్ 1960లలో ఇతర మతాలను అంగీకరించడం ప్రారంభించింది. 1964లో పోప్ జారీ చేసిన ఒక ఆదేశంలో 'వివిధ క్రైస్తవేతర మతాల నైతిక, ఆధ్యాత్మిక విలువలను గుర్తించి, గౌరవించాలని' పేర్కొన్నారు. మతాల మధ్య సంభాషణను ప్రతిపాదించి, ప్రోత్సహించిన ఇద్దరు ప్రముఖ భారతీయుల గురించి హోవార్డ్ తన పుస్తకంలో విపులంగా రాశారు. వారిలో మొదటి వ్యక్తి మొగల్ చక్రవర్తి అక్బర్. 1952లో ప్రముఖ చరిత్రకారుడు మఖన్‌లాల్ రాయచౌధురి రాసిన 'దీన్ ఇ ఇలాహి : అక్బర్ మతం' అనే పుస్తకం ఆధారంగా అక్బర్ గురించి హోవార్డ్ రాశాడు. ఆయన ఉటంకించిన ఆ చక్రవర్తి లేఖ ఒకటి నన్ను బాగా చకితుడిని చేసింది. తన సమకాలికుడు అయిన స్పెయిన్ రాజు రెండవ ఫిలిప్‌కు రాసిన లేఖ అది. యూదులు, ముస్లింలను స్పెయిన్ నుంచి బహిష్కరించిన తరువాత ఆ యూరోపియన్ దేశంలో కేథలిక్ క్రైస్తవ మత విశ్వాసాలు, సిద్ధాంతాలలో సంకుచితత్వం పెరగసాగింది. భారత్ నుంచి స్పెయిన్ నేర్చుకోవాలని రెండవ ఫిలిప్‌కు రాసిన లేఖలో అక్బర్ సూచించాడు. 'ఇక్కడ తాను పుట్టి పెరిగిన, జ్ఞానార్జనకు, స్వీయ జీవన రీతులకు ఆలంబనగా ఉన్న మతాన్ని అనుసరించడంలో కారణాల గురించి ఎవరూ విచారణశీలురు కారు. ప్రతి ఒక్కరూ తమ స్వీయ మత మార్గంలో నడుస్తారు. తద్వారా మానవ మేధ ఉత్కృష్ట లక్ష్యమైన సత్యాన్ని తెలుసుకొనే సాధ్యాసాధ్యాలనుంచి తమకు తాము మినహాయింపబడతారు. ఈ కారణంగా మేము మా దేశంలో అన్ని మతాల ఆచార్యులు, విద్వాంసుల సదస్సులు నిర్వహించి, వారి సునిశితమైన చర్చలు, వివేకదాయక ప్రవచనాలు, ఉజ్వల ఆశంసల నుంచి జ్ఞానవంతులమవుతుంటాము'. మతాల మధ్య సంభాషణను ప్రతిపాదించిన రెండవ మహోన్నత భారతీయుడు స్వామి వివేకానంద. అక్బర్‌కు కొన్ని శతాబ్దాల తరువాత జీవించిన వివేకానంద గురించి హోవార్డ్ సుదీర్ఘంగా రాశారు. 1893లో షికాగోలో జరిగిన సర్వ మత ప్రతినిధి సభలో వివేకానంద ప్రసంగానికి ప్రాధాన్యమిచ్చారు. తొలుత ఆ సభ లక్ష్యాలను ప్రస్తావించి వివేకానంద ప్రసంగ భాగాలను ఉటంకించారు. వాటిలో మొదటిది : 'సకల ప్రపంచానికి సహనాన్ని, విశ్వజనీనతను బోధించే ఒక శ్రేష్ఠమైన మతానికి చెందినవాడినని నా గురించి చెప్పుకోవడం నాకు ఎంతో గర్వంగా ఉంది. విశ్వ విశాలమైన సహనాన్నే కాక, మేము సమస్త మతాలూ సత్యమైనవే అని ఆమోదిస్తాము. ఈ సమస్త ధాత్రిపైన అసహనానికీ, హింసకు గురి అయిన అన్ని మతాల వారినీ, అన్ని దేశాలకు చెందిన వారిని, వారు శరణార్థులై వచ్చినప్పుడు ఆదరించి, వారికి భద్రత కలిపించిన ఉదారమయమైన మతం మాది అని చెప్పుకోవడానికి నేను గర్విస్తున్నాను'. రెండో ఉటంకింపు మరింత ముఖ్యమైనది: 'మత వైషమ్యం, అంధ విశ్వాసం. దీని భయంకర ప్రవృత్తి అయిన మత విద్వేష మాత్సర్యం ఈ సుందరమైన ధరిత్రిని ఎంతకాలంగానో అంటి పెట్టుకొని ఉండనే ఉన్నాయి. ఇవాళ ఉదయం ఈ మత మహాసభ గౌరవార్థం మోగిన ఘంటా నాదం అన్నిరకాల మత మూర్ఖత్వాన్ని, మత పరమైన హింసాపరత్వాన్ని కత్తితోనో లేదా కలంతోనో సాగించే మత దౌర్జన్యాన్ని, ఒక గమ్యాన్ని ఆశించి గమించే వారి మధ్య వైమనస్యాన్ని తుదముట్టించే మృత్యుఘంటిక అవుతుందని ఆశిద్దాం'. మహాత్మాగాంధీని కదాచిత్తుగా హోవార్డ్ ప్రస్తావించారు. ఆయన మత చింతనను లోతుగా పరామర్శించలేదు. వాస్తవానికి గాంధీ ఒక మత బహుళత్వ వాది. అక్బర్, వివేకానంద కంటే మరింత ప్రగాఢమైన, మౌలికంగా భిన్నమైన మత చింతకుడు. హిందూయేతర మతాలతో ఆయన తన సంభాషణను సాగించడమే కాదు ఒక సామాజిక కార్యక్రమంగా కూడా దాన్ని ఆచరించారు. దక్షిణాఫ్రికాలోను భారత్‌లోను ఆయన నిర్వహించిన సత్యాగ్రహాలు సమస్త ప్రపంచ మతాలకు చెందిన వారిని తమ ప్రభావశీల పరిధిలోకి తీసుకురావడానికి ప్రయత్నించాయి. ఆయన ఆశ్రమాలలో భిన్న మతాలకు చెందినవారు ఉండేవారు. నిరంతరం సన్నిహితంగా, పరస్పర గౌరవాదరాలతో కలసిమెలసి ఉండేవారు. గాంధీ ఆశ్రమాలలో రోజూ జరిగే సర్వ మత ప్రార్థనా సమావేశంలో భిన్న మతాల పవిత్ర గ్రంథాల నుంచి గీతాలు, శ్లోకాలు, సూక్తులు చదివేవారు, గానం చేసేవారు. ఇదొక వినూత్న, మత అనుష్ఠానం. యుద్ధాలతో సంక్షుభితమవుతున్న నేటి ప్రపంచానికి ఆ మానవీయ మతాచరణ ఉపయుక్తత ఎంతో ఉంది. నాస్తికుల వలే కాకుండా మానవ అవగాహనాశక్తికి అతీతమైన ఒక సర్వోన్నత శక్తి, ఒక ఉత్కృష్ట స్ఫూర్తి ఉందని గాంధీ అంగీకరించేవారు. మత విశ్వాసుల వలే కాకుండా తన మతమే భగవంతుడికి ఒక ప్రత్యేక, ఉన్నతోన్నతమైన బాట నిర్మించిందని గాంధీ ఎన్నడూ విశ్వసించలేదు. 1924లో 'భగవంతుడు ఒక్కడే' అన్న వ్యాసంలో ఆయన ఇలా పేర్కొన్నారు: భారతావని నుంచి ఇస్లాం, క్రైస్తవంను తొలగించాలని హిందువులు ఆశించడం ఒక పనికిమాలిన విషయం, అదొక వ్యర్థ వ్యవహారం మాత్రమే అవుతుంది.. అలాగే ముస్లింలు తాము విశ్వసించే ఇస్లాం మాత్రమే ఈ ప్రపంచాన్ని ఏలాలని కోరుకోవడమూ వ్యర్థమే... సత్యం ఏ ఒక్క మతం, ఏ ఒక్క మత గ్రంథం సొంత సొత్తుకాదు. అటువంటి సంకుచితత్వాలను తిరస్కరించిన ఉదాత్తుడు కనుకనే మత మార్పిడులను ఏ మతస్థుడు చేపట్టినా దాని ప్రయోజనాన్ని గాంధీ సంశయించేవారు.

## శివుని అనుగ్రహంతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలి

- వరంగల్ అర్బన్ కో-ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్ రావు





వరంగల్ ప్రతినిధి, ఫిబ్రవరి 15,తరంగాలు : మహాశివరాత్రి పర్వదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ, ప్రజలందరూ శివుని ఆశీస్సులతో సుఖసంతోషాలతో జీవించాలని బిజెపి రాష్ట్ర నాయకులు ఎర్రబెల్లి ప్రదీప్ రావు ఆకాంక్షించారు. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని కాశిబుగ్గలోని శివాలయంలో బిజెపి రాష్ట్ర నాయకులు, వరంగల్ అర్బన్ కో-ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్ రావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయానికి విచ్చేసిన ఆయన భక్తులతో కలిసి పరమశివునికి అభిషేకాలు, అర్చనలు చేసి రాష్ట్ర ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, సుఖశాంతులు కలగాలని ప్రార్థించారు.

మహాశివరాత్రి వంటి ఆధ్యాత్మిక పర్వదినాలు మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలని, ఇవి సమాజంలో ఐక్యతా భావాన్ని పెంపొందిస్తాయని ప్రదీప్ రావు పేర్కొన్నారు. యువత భారతీయ సంస్కృతిని ఆచరిస్తూ ధార్మిక విలువలను కాపాడాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు సముద్రాల పరమేశ్వర్, జిల్లా ప్రధాన కార్యదర్శి బాకం హరి శంకర్, జిల్లా ఉపాధ్యక్షులు కందిమల్ల మహేష్, జిల్లా కార్యదర్శి పైర్ల ఆనంద్, జిల్లా అధికార ప్రతినిధి రత్నం కృష్ణ కిషోర్, జిల్లా కౌన్సిల్ మెంబర్ కోమాకుల నాగరాజు, సీనియర్ నాయకులు ప్రభాకర్, గుర్రపు సత్యనారాయణ, రాఘవాచారి, ఆల్లీ అజయ్, మామిడాల సతీష్, కోట సతీష్, బైరి హరీష్, కందుకూరి శ్రీనివాస్, క్రాంతి,ఓని వెంకటేష్ మరియు స్థానిక నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## భద్రాచలంలో షెడ్యూల్ కులాల జేఏసీ ఏర్పాటుకు సన్నాహక సమావేశం

- మహనీయుల స్ఫూర్తితో ఏకతాటిపైకి ఎస్సీ లు రావాలన్న జాక్



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 15 తరంగాలు న్యూస్

భద్రాచలం పట్టణంలోని హరిత టూరిజం ప్రాంగణంలో షెడ్యూల్ కులాల జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) ఏర్పాటుకు సన్నాహక సమావేశం ఘనంగా నిర్వహించారు. సామాజిక న్యాయం, సమానత్వం లక్ష్యంగా ఈ జేఏసీని ఏర్పాటు చేయాలని సమావేశంలో ఏకగ్రీవంగా నిర్ణయించారు. ఈ సందర్భంగా మహనీయులైన మహాత్మ జ్యోతిరావు పూలే, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, పేరియర్ ఈ.వి. రామస్వామి, నారాయణ గురు, సాహు మహారాజ్, సంత్ గాడ్గే బాబా తదితరుల ఆశయాలు, భావజాలం ఆధారంగా షెడ్యూల్ కులాల ఐక్యత కోసం జేఏసీ అవసరమని నేతలు పేర్కొన్నారు. స్వతంత్రం వచ్చి దశాబ్దాలు గడుస్తున్నప్పటికీ రాజ్యాంగబద్ధ హక్కులు అమలు పరచాల్సిన పాలకులు నిర్లక్ష్యం వహిస్తున్నారని, షెడ్యూల్ కులాలకు అందాల్సిన న్యాయమైన ఫలాలు అందకుండా చేస్తున్నారని సమావేశంలో ఆవేదన వ్యక్తమైంది. ఈ నేపథ్యంలో భద్రాచలం డివిజన్ వ్యాప్తంగా అన్ని షెడ్యూల్ కులాలు ఏకతాటిపైకి వచ్చి తమ హక్కుల సాధన కోసం జేఏసీ ద్వారా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ఈ జేఏసీ ద్వారా షెడ్యూల్ కులాల్లోని అన్ని ఉపకులాల సమస్యలను ఒకే వేదికపై నుండి ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడం, దాడులు మరియు వివక్ష ఘటనలను నియంత్రించే దిశగా అధికారులకు వినతి పత్రాలు అందించడం, సమాజంలో అసమానతలను తొలగించేందుకు కృషి చేయడం లక్ష్యంగా నిర్ణయించారు. అవసరమైతే జేఏసీలోని న్యాయవాదుల సహకారంతో కోర్టులను ఆశ్రయించి, సమస్యలను త్వరితగతిన పరిష్కరించుకునే దిశగా చట్టపరమైన పోరాటం కొనసాగించాలన్న నిర్ణయం తీసుకున్నారు. భవిష్యత్తులో కార్యాచరణ ప్రణాళిక రూపొందించి జిల్లా వ్యాప్తంగా అన్ని షెడ్యూల్ కులాలను చైతన్యపరచాలని సమావేశంలో చర్చించారు.

ఈ కార్యక్రమంలో ప్రముఖ సీనియర్ న్యాయవాది అవులూరి సత్యనారాయణ, న్యాయవాది సాధనపల్లి సతీష్, సంఘ నాయకులు అల్లాడి పౌల్రాజ్, గడ్డం సుధాకర్ రావు, ఏవి రావు, పూస శ్రీను, రావులపల్లి తిరుపతిరావు, చీదరగడ్డ శేఖర్, కోకిల గాంధీ, కేసుపాక రవి, కోట దిలీప్, తిప్పనపల్లి ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

## శక్తితోనే సాధించాం!

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 15: అంతర్జాతీయంగా ఎన్ని ఒడిదుడుకులు ఉన్నా స్థిరమైన వృద్ధితో భారత్ నేడు ప్రపంచానికి గొప్ప ఆర్థిక వృద్ధి కేంద్రంగా మారిందని ప్రధాని మోదీ అన్నారు. ఇతర దేశాలతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పంద (ఎఫ్‌టీఏ) చర్చల్లో బలమైన స్థానంలో ఉండి బేరసారాలు నిర్వహించగలుగుతోందని తెలిపారు. యూపీఏ ప్రభుత్వం వాణిజ్య ఒప్పందాల విషయంలో ఆత్మవిశ్వాసంతో బేరమాడే స్థితిలో లేకపోవటంతో ఒప్పందాలు కుదరలేదని విమర్శించారు. ప్రముఖ వార్తా సంస్థ పీటీఐకి ఆదివారం ఆయన ఇంటర్వ్యూ ఇచ్చారు. ఇటీవల పార్లమెంటులో ప్రవేశపెట్టిన కేంద్రబడ్జెట్ నుంచి వివిధ దేశాలతో ఎఫ్‌టీఏలు, దేశ వృద్ధి ప్రస్థానం, వికసిత్ భారత్ భవిష్యత్ లక్ష్యాలు తదితర అంశాలపై తన అభిప్రాయాలను వెల్లడించారు.

## రాహుల్ దెబ్బకు పార్లమెంటులో తోకముడిచిన బీజేపీ

- పార్లమెంటు సాక్షిగా... బీజేపీపై రాహుల్ 'గాండీవం'..!

హైదరాబాద్, ఫిబ్రవరి 15,తరంగాలు : గత పదేళ్లుగా రాహుల్ గాంధీని 'పప్పు' అని ముద్రవేసి రాజకీయంగా అణచివేయాలని చూసిన అధికార బీజేపీకి ఇప్పుడు చుక్కలు కనిపిస్తున్నాయి. పార్లమెంటు వేదికగా రాహుల్ సంధిస్తున్న ప్రశ్నలు కమలనాథులను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. తాజాగా 'ఎప్ స్టీన్ ఫైల్స్' వ్యవహారం, మాజీ ఆర్మీ చీఫ్ నరవణే పుస్తకంలో మోదీ సర్కార్ అలసత్వంపై రాహుల్ గాంధీ నిలదీసిన తీరు.. దేశ రాజకీయాల్లో పెను సంచలనంగా మారింది. ఈ పరిణామాలతో ప్రతిపక్ష నాయకుడిగా రాహుల్ తన విశ్వరూపాన్ని ప్రదర్శించగా, కమలం పార్టీ ఒక్కసారిగా ఆత్మరక్షణలో పడిపోయిందనే చర్చ దేశమంతటా సాగుతోంది. దేశ భద్రతకు సంబంధించిన సున్నితమైన అంశాలపై రాహుల్ ప్రశ్నలు అడగగానే, ప్రజల దృష్టిని మళ్లించేందుకు బీజేపీ 'అవిశ్వాసం' డ్రామాను తెరపైకి తెచ్చింది. రాహుల్ గాంధీ ఆరోపణలను తప్పుడు సాక్ష్యాలుగా చిత్రీకరిస్తూ నిషికాంత్ దూబే ద్వారా ప్రివిలేజ్ నోటీసులు ఇప్పించి భయపెట్టాలని చూసింది. అయితే, అసలు ట్విస్ట్ అక్కడే మొదలైంది. "నేను చేసిన ప్రతి ఆరోపణను నిరూపించడానికి సిద్ధంగా ఉన్నాను" అంటూ రాహుల్ విసిరిన సవాల్‌తో బీజేపీ పెద్దలలో వణుకు మొదలైంది. చట్టపరంగా ఆ నోటీసులు నిలబడవని, రివర్స్ అయితే పార్టీ పరువు మొత్తం గంగలో కలుస్తుందని గ్రహించిన బీజేపీ ప్రభుత్వం.. ఒక్కసారిగా వెనక్కి తగ్గింది. ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా వలె ప్రజలను మతం పేరుతో విభజించడం, తప్పుడు ప్రచారాలతో, దేశభక్తి పేరుతో అమాయక యువతను రెచ్చగొట్టడం, ఊకదంపుడు ఉపన్యాసాలతో కాలక్షేపం చేయడం రాహుల్ గాంధీ నైజం కాదు. దశాబ్దాలుగా ప్రజల సేవలోనే నిమగ్నమైన నిజమైన గాంధీ కుటుంబ వారసుడిగా ప్రజా సమస్యల పట్ల కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిలదీయడమే లక్ష్యంగా రాహుల్ గాంధీ ముందుకు సాగుతున్నారు. పార్లమెంటులో ఆయన ప్రసంగాలను చూస్తుంటే, ఒక పరిణతి చెందిన నాయకుడిగా, దేశానికి భవిష్యత్ ప్రధానిగా ఉండగలిగే అన్ని లక్షణాలు రాహుల్ గాంధీలో స్పష్టంగా కనిపిస్తున్నాయని దేశంలోని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. రాహుల్ గాంధీ ప్రశ్నలకు సమాధానం చెప్పలేక బీజేపీ ప్రభుత్వం ఆయన ప్రసంగంలోని ముఖ్యాంశాలను రికార్డుల నుండి తొలగిస్తున్నది. ఇదంతా చూస్తుంటే, రాహుల్ మాటల ధాటికి ప్రభుత్వం ఎంతలా భయపడుతుందో అర్థమవుతోంది. దూబేను అడ్డం పెట్టుకుని రాహుల్‌ను ఇరుకున పెట్టాలని చూసిన బీజేపీ, చివరికి తానే 'జోకర్' లా మారిపోయింది. "మేము ఆయనపై ఎలాంటి తీర్మానం తీసుకురావడం లేదు" అంటూ ఇప్పుడు స్టేట్‌మెంట్లు ఇస్తుండటం రాజకీయంగా హాస్యాస్పదంగా మారింది. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే గొంతుకను అణచాలని చూస్తే అది ఎంతటి విపత్కరమో బీజేపీకి ఇప్పుడు అర్థమైంది. మొత్తానికి, పార్లమెంటులో రాహుల్ గాంధీ పోరాట పటిమను చూసిన జనం.. "బీజేపీకి ఈ భయం బాగుంది" అని నవ్వుకుంటున్నారు. త్యాగానికి మరో పేరుగా, ప్రజల బాగుకోసం బలిదానాలకు కూడా వెరవని గాంధీ కుటుంబ వారసుడిగా రాహుల్ గాంధీ తన సమర్థవంతమైన పాత్రతో దేశంలోని అన్నివర్గాల ప్రజలనూ మెప్పిస్తున్నారు. దీన్నిబట్టి చూస్తే రాబోయే రోజుల్లో ప్రజా గొంతుకగా రాహుల్ ప్రస్థానం దేశ రాజకీయాల్లో ఒక నూతన అధ్యాయాన్ని లిఖించబోతోందనడంలో సందేహం లేదు.



- బండి సుధాకర్ గౌడ్, టీపీసీసీ అధికార ప్రతినిధి, 99123 71755

# ప్రభుత్వ భూములను పేదలకు పంచాలి సి పి ఐ



**జఫర్గడ్ ప్రతినిధి, ఫిబ్రవరి 15,(తరంగాలు):** మండలంలోని అలియబాద్ రెవెన్యూ శివారులోని 10 వ సర్వేనెంబర్లో ఉన్నటువంటి ప్రభుత్వ భూమిని భారత కమ్యూనిస్టు పార్టీ మండల కమిటి ఆధ్వర్యంలో సందర్శించడం జరిగిందని పార్టీ మండల కార్యదర్శి జిల్లా కార్యవర్గ సభ్యులు జువారి.రమేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో అనేక గ్రామాల్లో మండల కేంద్రంలో ప్రభుత్వ భూముల్ని ఎక్కడ పడితే అక్కడ ఆక్రమించుకొని రెవెన్యూ అధికారుల అండదండలతో పట్టాలు చేసుకొని చెలామణి అవుతున్నరన్నారు. మండల కేంద్రానికి సమీపాన ఉన్నటువంటి 10వ సర్వేనెంబర్లో ఉన్నటువంటి భూమిని ప్రభుత్వ అధికారులు సర్వే చేసి హద్దులు నిర్ణయించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదలకు ఇండ్ల స్థలం లేని వారికి ఇచ్చి ఇండ్లు కట్టించే బాధ్యత తీసుకోవాలన్నారు నేటికి ఇండ్ల స్థలం లేని వారికి ఇందిరమ్మ ఇల్లు ఇవ్వలేదని ఆయన తెలిపారు అదేవిధంగా నిరంతరం ప్రజలకోసం ప్రజా సమస్యలు ప్రభుత్వాల దృష్టికి తీసుకుపోయే వారధిగా ఉన్నటువంటి జర్నలిస్టులకు ఇండ్లు ఇండ్ల స్థలాలు ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వాశీపై ఉందన్నారు రెక్కాడితే గాని డొక్కాడని పేదలు ఇప్పటికి ఎంతో మంది ఉన్నారన్నారు ప్రభుత్వ అధికారులు తక్షణమే స్పందించి హద్దులు పెట్టి అక్రమంగా అక్రమించినా వారి పై చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో భూపోరాటలు చేస్తామని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల అధ్యక్షుడు ఎండీ యాకుబ్ పాషా ,పార్టీ మండల కార్యవర్గ సభ్యులు వడ్లకొండ సుధాకర్, రాడపక సత్తయ్య, డి హెచ్ పి యస్ జిల్లా అధ్యక్షులు కలకోట ప్రభాకర్,మహిళ సమాఖ్య మండల నాయకులు ఎండీ నుర్నిశ, కుక్కల శోభా,నాయకులు వేల్పుల పెద్దరాములు, మాజీ సర్పంచ్ ఉప్పునుతుల మల్లయ్య, ఎల్మకంటి రవి,జువారి భద్రమ్మ, కొంతం రాజు, ఎండీ కుద్దుస్, నక్కా భిక్షపతి, తదితరులు పాల్గొన్నారు.

# శివనామ స్మరణతో మారుమోగిన శివాలయాలు

- భక్తులతో కిటకిటలాడిన కాట్రపల్లి శివాలయం..
- భక్తజన సందడితో ధన్నసరి మల్లన్న జాతర

**కేసముద్రం, మహబూబాబాద్ జిల్లా, ప్రతినిధి, ఫిబ్రవరి.15, తరంగాలు :** కేసముద్రం మున్సిపాలిటీ పరిధి ధన్నసరి మల్లన్న గుట్టతో పాటు మండలంలోని, కాట్రపల్లి గ్రామంలో కాకతీయుల శివాలయం, వెంకటగిరి గ్రామంలో శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవాలయం మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శివనామ స్మరణతో శివాలయాలు మారుమోగాయి. ఆదివారం తెల్లవారుజామున నుంచి భక్తులు కుటుంబ సభ్యులతో, పిల్లాపాపలతో శివాలయాలకు తరలివచ్చి అభిషేకాలు, అర్చనలు చేస్తూ, స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దీంతో శివాలయాల్లో భక్తులు కిటికీటలాడుతూ దర్శనాల కోసం బారులు తీరారు. కేసముద్రం మున్సిపాలిటీ పరిధి దన్నసరి గుట్టపై స్వయంభు శ్రీ మల్లికార్జున స్వామి దేవాలయంలో జాతర ఉత్సవాలను మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సిబ్బందితో ఏర్పాట్లను చేశారు. ఈ మేరకు



భక్తజనులతో ఆహ్లాదకరమైన వాతావరణంతో గుట్టపై భక్తులతో దేవాలయం కిటకిట లాడింది.కాట్రపల్లి కాకతీయలనాటి శివాలయంలో దేవాలయ అర్చకులు వరంగంటి వెంకటాచార్యులు, ధన్నసరి గుట్టపై ఆరేందల ప్రభాకరాచారి, యశ్వంత్ ఆచార్య, వెంకటగిరి గ్రామంలో కందాల ఆదర్శచార్యులు, పత్తిపాక శ్యామ్ కుమార్ వేద మంత్రోచ్చరణల నడుమ మహా శివుడికి రుద్రాభిషేకం, విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించి,తెల్లవారుజామున శివపార్వతులకు వైభవోపేతంగా కళ్యాణ మహోత్సవాలను నిర్వహించారు.

# మైరా మురిపెంలో.. పరమశివుని చెంత మంత్రి పొంగులేటి దంపతులు.





**పాలేరు ఆర్సీ,15 ఫిబ్రవరి (తరంగాలు).** తీర్థాల, కూసుమంచి, బెండాలపాడు క్షేత్రాల్లో కుటుంబ సమేతంగా పూజలు వేద ఆశీర్వచనాల మధ్య మంత్రి దంపతులకు ఆలయాల్లో ఘన స్వాగతం మహాశివరాత్రి పర్వదినం వేళ ముక్కంటి చెంత భక్తి పారవశ్యం వెల్లివిరిసింది. తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, మాధురి దంపతులు తమ ముద్దుల మనుమరాలు మైరాతో కలిసి ఆదివారం ఉమ్మడి జిల్లాలోని ప్రసిద్ధ శైవక్షేత్రాలను సందర్శించారు. పసిప్రాయంలోనే భక్తిభావంతో స్వామివారిని దర్శించుకుంటున్న మైరా మురిపెంలో మంత్రి కుటుంబ సభ్యులు ఆధ్యాత్మికంలో మునిగితేలారు. లోక కల్యాణాన్ని కాంక్షిస్తూ సాగిన ఈ పర్యటనలో మంత్రి దంపతులకు ఆలయ అధికారులు, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి శేషవస్త్రాలతో ఘనంగా సత్కరించారు.

**తీర్థాల, కూసుమంచిలో ఆధ్యాత్మిక వెలుగులు:**

?మంత్రి కుటుంబం తొలుత పాలేరు నియోజకవర్గంలోని ఖమ్మం రూరల్ మండలం తీర్థాల శ్రీ సంగమేశ్వర స్వామి వారిని దర్శించుకుంది. త్రివేణి సంగమ క్షేత్రంలో వెలసిన స్వామివారికి అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. మనుమరాలు మైరాతో కలిసి మంత్రి దంపతులు పూజల్లో పాల్గొన్న దృశ్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అనంతరం చారిత్రక ప్రసిద్ధి గాంచిన కూసుమంచి శ్రీ గణపేశ్వర స్వామి ఆలయానికి చేరుకున్నారు. కాకతీయుల శిల్పకళా వైభవానికి నిలువుటద్దంగా నిలిచే ఈ క్షేత్రంలో స్వామివారిని దర్శించుకుని వేద పండితుల ఆశీర్వచనాలు అందుకున్నారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలి.. ?దర్శనానంతరం మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ.. "మహాశివరాత్రి పర్వదినాన రాష్ట్ర ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, ఐశ్వర్యాలతో విరాజిల్లాలని, తెలంగాణ రాష్ట్రం పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని ఆ పరమశివుడిని వేడుకున్నాను" అని తెలిపారు. ఈ పర్యటనలో స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రోడ్డు విస్తరణలో ప్రజా ఆస్తి రక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలి

- 80 ఫీట్లకు బదులుగా 60 ఫీట్ల వెడల్పుతో రోడ్డు వేయాలి
- తెలంగాణ వాచ్ డాగ్ వ్యవస్థాపక అధ్యక్షుడు చిట్యాల వీరన్న



**కేసముద్రం, మహబూబాబాద్ జిల్లా, ప్రతినిధి, ఫిబ్రవరి.15, తరంగాలు:** కేసముద్రం మునిసిపాలిటీలో కోట్ల రూపాయల వ్యయంతో చేపడుతున్న రోడ్డు విస్తరణ పనులు హర్షణీయమని, అయితే ప్రజల ఆస్తి నష్టం జరగకుండా ప్రభుత్వం పునరాలోచన చేయాలని తెలంగాణ వాచ్ డాగ్ వ్యవస్థాపక అధ్యక్షుడు చిట్యాల వీరన్న కోరారు.పొట్టి శ్రీరాములు సెంటర్ నుంచి గాంధీ సెంటర్ మీదుగా బైపాస్ రోడ్డు వరకు, అలాగే పూలే విగ్రహం నుంచి అంబేద్కర్ సెంటర్ మీదుగా అమినాపురం వరకు రోడ్డు విస్తరణ పనులు చేపడుతున్న నేపథ్యంలో రోడ్డు వెడల్పును 80 ఫీట్లకు బదులుగా 60 ఫీట్లకే పరిమితం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అంతేకాకుండా మధ్యలో ఏర్పాటు చేసే డివైడర్ వెడల్పును కూడా తగ్గించి మూడు ఫీట్ల పరిమితిలోనే నిర్మించాలని సూచించారు.ఈ నిర్ణయం వల్ల అనేక దుకాణాలు, ఇళ్లు కూల్చివేతలకు గురికాకుండా రోడ్డు విస్తరణ పనులను అమలు చేసే అవకాశం ఉంటుందని ఆయన అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా ఉప్పరపల్లి రోడ్డు, మార్కెట్ రోడ్డు ప్రాంతాల్లో ప్రజల ఆస్తి నష్టం తక్కువగా ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.రాబోయే నూతన పాలకవర్గం ఈ సమస్యను సానుకూలంగా పరిశీలించి ప్రజలకు అనుకూలమైన నిర్ణయం తీసుకోవాలని చిట్యాల వీరన్న విజ్ఞప్తి చేశారు.

# కొత్తగూడెంలో మారుతున్న రాజకీయ సమీకరణాలు

- మంత్రి పొంగులేటి సమక్షంలో కాంగ్రెస్‌లోకి ఐదుగురు స్వతంత్ర కార్పొరేటర్లు
- సిపిఎం మద్దతుతో 28కి చేరిన కాంగ్రెస్ బలం
- మేయర్ పదవిని చెరి రెండున్నర సంవత్సరాల చొప్పున పంచుకునే ఒప్పందం



**కొత్తగూడెం, ఫిబ్రవరి 15 (తరంగాలు ప్రతినిధి):** కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్‌లో రాజకీయ సమీకరణాలు మారుతున్నాయి. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సమక్షంలో ఐదుగురు స్వతంత్ర కార్పొరేటర్లు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ పరిణామంతో కార్పొరేషన్‌లో అధికార సమీకరణాలు కీలక మలుపు తిరిగాయి. సిపిఎం మద్దతుతో కలిపి కాంగ్రెస్ బలం 28కి చేరినట్లు సమాచారం. ఈ మార్పుతో కార్పొరేషన్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధిపత్యం బలపడినట్లు పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. స్థానిక రాజకీయాల్లో ఈ పరిణామం చర్చనీయాంశమైంది. మేయర్ పదవిని చెరి రెండున్నర సంవత్సరాల చొప్పున పంచుకునేలా సిపిఐ--కాంగ్రెస్ మధ్య ఒప్పందం కుదిరినట్లు తెలుస్తోంది. ఈ అవగాహనతో కార్పొరేషన్ పరిపాలనలో స్థిరత్వం తీసుకురావాలనే ఉద్దేశం ఉన్నట్లు పార్టీ నాయకులు చెబుతున్నారు. కొత్తగూడెం కార్పొరేషన్‌లో జరిగిన ఈ పరిణామం జిల్లా రాజకీయాల్లో ప్రభావం చూపే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. రానున్న రోజుల్లో అధికార మార్పిడి, మేయర్ ఎన్నికల ప్రక్రియపై స్పష్టత వచ్చే అవకాశముంది.

# గిరిజనుల జీవితాలలో వెలుగులు నింపిన మహనీయుడు సేవలాల్ మహారాజ్ కడ్తాల్ మాజీ జెడ్పిటిసి దశరథ్ నాయక్

- ఆధ్యాత్మిక గిరిజన ఆరాధ్య దేవుడు సంత్ సేవాలాల్ మహారాజ్



**కల్వకుర్తి. ఫిబ్రవరి 15. తరంగాలు ప్రతినిధి** కడ్తాల్ మండల కేంద్రంలో సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలు గిరిజన సంఘాల నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న కడ్తాల్ మాజీ జెడ్పిటిసి లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు జర్పుల రాధాకృష్ణ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ జర్పుల దశరథ్ నాయక్ . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన ఆరాధ్య దైవం సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ గొప్ప ఆధ్యాత్మిక వేత్త అన్ని గిరిజనుల జీవితాల్లో వెలుగులు నింపిన మహనీయుడు సేవాలాల్ మహారాజ్ అని కొనియాడారు.ఆయన ఆశయాల సాధనకు అందరూ కృషిచేయాలన్నారు.బిఆర్ఎస్ హయాంలో గిరిజన సేవాలాల్ మహారాజ్ భవనం రాష్ట్ర రాజధానిలో నిర్మించడం జరిగింది సేవాలాల్ మహారాజ్ జయంతిని అధికారికంగాజరుపుకోవడానికి అవకాశం కల్పించింది అదేవిధంగా తండాలను



గ్రామపంచాయతీలు చేయడంతో పాటు గిరిజనుకు 10 శాతం రిజర్వేషన్ తో పాటు అభ్యున్నతికి ఎంతో కృషి చేయడం జరిగిందని గుర్తు చేశారు.అదేవిధంగా గిరిజనుల సంక్షేమానికి బిఆర్ఎస్ ప్రభుత్వం ఎంతో కృషి చేసిందని తెలిపారు. సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ దేశం గర్వించదగ్గ ఆధ్యాత్మిక వేత్త అని ఆయన సూచించిన మార్గంలో అందరూ ముందుకు సాగాలని సూచించారు. గిరిజనులలో అభ్యున్నతికి సేవాలాల్ చేసిన కృషి చిరస్మరణీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో గిరిజన రాష్ట్ర నాయకులు గిరిజన సంఘాలు నాయకులు యువకులు ప్రజా ప్రతినిధులు నాయకులు తదితరులు పాల్గొన్నారు

# రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలి

**వరంగల్ ప్రతినిధి, ఫిబ్రవరి 15,తరంగాలు :** మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య చారిత్రక రుద్రేశ్వరస్వామి వేయిస్తంభాల దేవాలయంను సందర్శించారు. ఆలయంలో స్వామివారిని దర్శించుకుని, ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి పూజలు చేశారు. మహాశివరాత్రి వేడుకల్లో భాగంగా నిర్వహించిన శివ--పార్వతుల కళ్యాణ మహోత్సవంలో ఎంపీ డాక్టర్ కడియం కావ్య పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని, దేశంలో శాంతి, సుభిక్షం నెలకొనాలని ఎంపీ డాక్టర్ కడియం కావ్య స్వామివారిని ప్రార్థించారు. అనంతరం ఆలయ అర్చకులు వేదమంత్రోచ్చారణలతో ఎంపీకి ఆశీర్వచనాలు అందజేశారు. అనంతరం ఆలయ నిర్వహణ, భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాలపై అధికారులతో ఎంపీ మాట్లాడారు. శివరాత్రి సందర్భంగా ఆలయానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చిన నేపథ్యంలో, ఏర్పాట్లు సమర్థవంతంగా నిర్వహించిన దేవస్థాన సిబ్బందిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, దేవస్థాన అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, భక్తులు పాల్గొన్నారు.



# చైర్ పర్సన్ పదవి మాదిగలకే ఇవ్వాలి..

## ఎంఆర్పీఎస్ జిల్లా బాధ్యులు కందుల బాబుమాదిగ



**పాలేరు ఆర్సీ,15 ఫిబ్రవరి (తరంగాలు) :** ఏదులాపురం మున్సిపాలిటీ చైర్ పర్సన్ పదవి మాదిగలకే ఇవ్వాలని ఎమ్మార్పీఎస్ జిల్లా బాధ్యులు కందుల బాబుమాదిగ డిమాండ్ చేశారు. ఆదివారం రెడ్డిపల్లిలో జరిగని ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాదిగలపై ఉన్న చిత్తశుద్ధి నిరూపించుకోవాలన్నారు. మాదిగలు మొదటినుంచి కాంగ్రెస్ పార్టీని నమ్ముకుంటూ వస్తున్నారని, అలాంటి వారికి గత అసెంబ్లీ ఎన్నికల్లో కూడా ఈ జిల్లాలో రెండు అసెంబ్లీ సీట్లు ఒకే వర్గానికి ఇచ్చారని, జిల్లా పరిషత్, తదితర నామినేటెడ్ పదవుల్లో కూడా మాదిగలకు మొండి చేయి చూపారన్నారు. ఈసారి ఏదులాపురం మున్సిపాలిటీ చైర్ పర్సన్ పదవి ఎస్సీ మహిళకు రిజర్వు అయినందున ఎస్సీ లోని మాదిగ వర్గానికి ఇప్పటివరకు కాంగ్రెస్ ప్రభుత్వంలో ఖమ్మం జిల్లాలో తగిన ప్రాతినిధ్యం లేనందున ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలో కాంగ్రెస్ పార్టీ నుండి ఎస్సీ మహిళలు నలుగురు గెలిస్తే ముగ్గురు మాదిగ కులమునకు చెందినవారే అన్నారు. 9వవార్డు కౌన్సిలర్ కందుకూరి శేషమ్మ, ఆమె భర్త వెంకట్ నారాయణ చిన్నప్పటి నుండి కాంగ్రెస్ పార్టీ జెండా మోసి పార్టీ అధికారంలో లేని సమయంలో నమ్మిన సిద్ధాంతం కోసం కొట్లాడి పార్టీ కోసం ఎంతో చెమటోడ్చి నిలిచిచారన్నారు. 17వ వార్డ్ కౌన్సిలర్ గొడ్డుగొర్ల కృష్ణకుమారి ఉన్నత విద్యావంతురాలు ఆమె భర్త గురునారాయణ మొదటి నుంచి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తగా కొనసాగుతున్నారన్నారు. 21వ డివిజన్ కౌన్సిలర్ కోటమర్తి సునీత ఉన్నత విద్యావంతురాలు. పేరుగాంచిన కమ్యూనిస్టు కోటలో గెలిచి తన మంచితనాన్ని నిరూపించుకుంది ఇట్లాంటి చరిత్ర గల ఈ ముగ్గురిలో ఎవరో ఒకరికి చైర్పర్సన్ పదవి ఇవ్వాలని ఇచ్చి మాదిగల పక్షాన కాంగ్రెస్ పార్టీ, మంత్రి పొంగులేటి తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలన్నారు.

పొంగులేటి రాజకీయ జీవితంలో చాలామందిని ప్రోత్సహించారని అందులో మాదిగలు ఎక్కడ కనబడరని ఈ అవకాశాన్నైనా పేద వర్గాలైన ఈ ముగ్గురిలో ఒకరికి ఇచ్చి నేను మాదిగలకు కూడా అండగా ఉంటానని భరోసానివ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో జాంబవ గ్రూప్ సభ్యులు పేరెల్లి శ్రీనివాస్ మరికంటి కన్నారావు, కొల్లి విద్యాసాగర్, నెమలి కిషోర్, మాతంగి అనిల్, బొబ్బిళ్ళ నాగరాజు, వెలుతురు శ్రీనివాస్, మునగాల లాల్ బాబు, బోయిన కృష్ణ, గుగ్గిళ్ళ ప్రభాకర్, ఉపేందర్, శ్రీనివాసులు, పాల్గొన్నారు.

# నల్లబెల్లి గ్రామంలో ఘనంగా మహాశివరాత్రి ఉత్సవాలు

**వైభవంగా సామూహిక మహన్యాస రుద్రాభిషేక కార్యక్రమం**

**వర్ధన్నపేట ప్రతినిధి, ఫిబ్రవరి 15,తరంగాలు :** వర్ధన్నపేట మండలం నల్లబెల్లి గ్రామంలో శ్రీ ఉమామహేశ్వర స్వామి ఆలయంలో ఘనంగా మహాశివరాత్రి ఉత్సవాలు నిర్వహించారు. ఈ మహాశివరాత్రిని పురస్కరించుకొని గ్రామంలో సామూహికంగా 100 మంది పుణ్య దంపతులచే సామూహికంగా మహన్యాస రుద్రాభిషేక కార్యక్రమాన్ని వేద బ్రాహ్మణులచే ఘనంగా నిర్వహించడం జరిగింది. ఆలయ ప్రధాన అర్చకులు నాగరాజు ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించడం జరిగింది. సాంస్కృతిక కార్యక్రమాలు శివ కళ్యాణోత్సవం ఉదయము గ్రామంలోని పురవీధులలో శివయాత్ర ఘనంగా జరిగింది. సన్నాయి మేళాలతో సంస్కృతిక కోలాటాలతో శివ కళ్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించడం జరిగిందని నల్లబెల్లి గ్రామ సర్పంచ్ జక్కి అనిత శ్రీకాంత్ తెలియజేశారు. శివ కళ్యాణం ఉత్సవాన్ని ప్రతి సంవత్సరం నిర్వహించడం ఉత్సవాలను ఏర్పాట్లను అంగరంగ వైభవంగా చేయడం జరుగుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ మేకల దేవేందర్, గ్రామ ప్రముఖులు, భక్త భజన మండలి, గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



# వజ్ర హాస్పిటల్స్ సేవలు భేష్..

- భక్తుల ప్రసంశలు అందుకున్న
- ఇంటూరి నాగరాజుచౌదరి

**కూసుమంచి, 15ఫిబ్రవరి (తరంగాలు)** మహాశివరాత్రి పర్వదిన్నాన్ని పురస్కరించుకుని భక్తుల సౌకర్యార్థం కూసుమంచి బస్టాండ్ సెంటర్ నుంచి, శివాలయం వరకు ఉచితంగా ప్రయాణ సౌకర్యం కల్పించిన వజ్ర హాస్పిటల్ యాజమన్యాన్ని భక్తులు ప్రశంశలతో ముంచెత్తారు. ఈ సందర్భంగా చైర్మన్ ఇంటూరి నాగరాజు చౌదరిని సౌకర్యం ఉపయోగించుకున్న ప్రతి భక్తుడు, భక్తురాలు కొనియాడారు. ప్రతి సంవత్సరం ఈ సౌకర్యాన్ని కల్పిస్తున్న నాగరాజు చౌదరి సేవలు మరువలేనివన్నారు. వేసవికాలం మొదలైన సందర్భంగా ఎండలు దంచికొడుతుండడంతో భక్తుల ఇబ్బందులు మదిలో ఉంచుకుని ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించినందుకు ధన్యవాదాలు తెలిపారు.






# ప్యాకేజ్డ్ ఆహారంపై 'హెచ్చరిక' ఉండాల్సిందే!

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 15 :** ప్రజల ఆరోగ్యంతో ఆటలాడొద్దని సుప్రీంకోర్టు ఎఫ్ఎసఎసఏను హెచ్చరించింది. ఆరోగ్యం ప్రజల ప్రాథమిక హక్కు అని స్పష్టం చేసింది. ప్రజారోగ్యం విషయంలో రాజీపడే ప్రసక్తేలేదని తేల్చిచెప్పింది. ఇకపై ప్యాకేజ్డ్ ఆహారంపై 'హెచ్చరిక' ముద్ర తప్పనిసరిగా ఉండాల్సిందేని భారత ఆహార భద్రత, ప్రమాణాల ప్రాధికార సంస్థ (ఎఫ్ఎసఎసఏఐ)ను ఆదేశించింది. ప్యాకెట్లలోని ఆహారంలో అధిక చక్కెర, ఉప్పు, కొవ్వుకు సంబంధించి వినియోగదారుడికి అర్థమయ్యేలా ప్యాకెట్ ముందు భాగంలోనే స్పష్టమైన హెచ్చరికల లేబుళ్లు తప్పనిసరి చేయాలని పేర్కొంది.


FEB
16
2026
happy birthday
HAPPY BIRTHDAY
happy birthday
BIRTHDAY
HAPPY BIRTHDAY
Lasya Patel